శుక్రవారం
21-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 30
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వెనిజులాపై ఆంక్షల్ని ఎత్తివేయాలి

వెనిజులాపై అనైతిక, అక్రమ, నేరపూరిత ఆంక్షలన్నింటిని బేషరతుగా ఎత్తివేయాలని ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో డిమాండ్ చేశారు. గతాన్ని మరిచి యూరప్‌తో దౌత్యపరంగా సంబంధాల పునరుద్ధరణను కోరుకుంటున్నట్లు తెలిపారు. బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ తమ వాస్తవికతను వెల్లడించడం ద్వారా వెనిజులా గతంలో జీవించాలని అనుకోవడం లేదని యూరప్ గ్రహిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు.

2 లో

గమ్యం దిశగా చంద్రయాన్

- 25న ఐదో కక్ష్య పెంపు
- నాల్గో కక్ష్యపెంపు విజయవంతం-సౌర మిషన్‌కు సంసిద్ధం
- ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



బెంగళూరు: చంద్రునిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 తన గమ్యం వైపునకు వేగంగా దూసుకెళుతోంది. ఇప్పటివరకు ఏ దేశం వెళ్లని చంద్రుని దక్షిణ ధ్రువంపై పరిశోధనల కోసం చంద్రయాన్-3ని ఇస్రో ప్రయోగించింది. ఇప్పటివరకు మూడో కక్ష్యలో భూమి చుట్టూ చక్కర్లు కొట్టిన చంద్రయాన్-3, నాలుగో కక్ష్య పెంపును గురువారం విజయవంతంగా పూర్తి చేసింది. ఈనెల 25న మధ్యాహ్నం 2-3 గంటల మధ్యలో ఐదో కక్ష్య పెంపు కార్యక్రమాన్ని చేపట్టనున్నది. ఈ మొత్తం ప్రకియను ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్వర్క్ (ఐఎస్‌టీఆర్‌ఏసీ) పర్యవేక్షిస్తోంది. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం సందర్భంగా చంద్రయాన్-3 చంద్రుడికి మరింత చేరువ చేస్తూ నాలుగో కక్ష్య పెంపు నిర్వహించినట్లు ఇస్రో కేంద్ర కార్యాలయం తాజా ప్రకటన

- మిగతా 2 లో

ఏపీలో పెట్రో మంటలు

- దేశంలోనే అత్యధిక ధరలు
- పార్లమెంటు సాక్షిగా కేంద్రం ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీలో పెట్రోలు, డీజిల్ ధరలు మండిపోతున్నాయి. దేశంలోనే అత్యధిక ధరలకు ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా వెల్లడించింది. పెట్రోలు, డీజిల్ ఇతర పెట్రోలియం ఉత్పత్తులను దేశమంతా ఒకే ధరల విధానం ప్రవేశపెట్టే అవకాశం ఉందా ? అని రాజస్థాన్‌కు చెందిన ఎంపీ రాహుల్ కశ్వాన్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా చమురు ధరల విధానం ఇప్పటివరకు ఒకేలా లేదని, రాష్ట్రాల్లో పన్నుల ఆధారంగా రకరకాల రేట్లు అమలవుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జులై 18వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల రాజధాని నగరాలు, ముఖ్యపట్టణాల్లో ఉన్న పెట్రోలు, డీజిల్ ధరల వివరాలను వెల్లడించారు. ఏపీలో రిఫరెన్స్ సిటీగా అమరావతిని పేర్కొంటూ ధరలు సేకరించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారీగా పెట్రోలు, డీజిల్ ధరలను మంత్రి సభ ముందుంచారు. దాని ప్రకారం అమరావతిలో లీటరు పెట్రోలు ధర రూ.111.87 పైసలుండగా, డీజిల్ ధర రూ.99.61గా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ అగ్రస్థానంలో ఉండటం విశేషం. డీజిల్ ధరల్లో మాత్రం లక్షద్వీప్ లీటరు రూ.103.08పైసలతో తొలిస్థానంలో నిలవగా, ఏపీ రూ.99.61పైసలతో రెండో స్థానంలో ఉంది. రూ.98.53పైసలతో కేరళ తృతీయ, రూ.97.82పైసలతో తెలంగాణ రాష్ట్రం నాల్గవస్థానంలో ఉన్నాయి. అలాగే పెట్రోలు ధరలో ఏపీ ప్రథమస్థానంలో ఉండగా, రూ.109.73పైసలతో కేరళ ద్వితీయ, రూ.109.66 పైసలతో తెలంగాణ తృతీయ, రూ.108.65పైసలతో మధ్యప్రదేశ్ నాల్గవస్థానంలో ఉన్నాయి. పెట్రోలు అత్యల్పంగా కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్, నికోబార్ దీవుల్లో రూ.84 ఉండగా, మిజోరాం రాష్ట్రంలో లీటరు రూ.95.88పైసలకు విక్రయిస్తున్నారు. డీజిల్ కూడా దేశంలో అతి తక్కువ ధరలతో అరుణాచల్ ప్రదేశ్ రూ.82.2పైసలు, మిజోరాం రూ.82.27పైసలకు విక్రయిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

జిల్లాల విభజనతో
పాలన రగడ

- ఏలూరు కలెక్టరు వర్సెస్ పేర్ని నాని
- సీఎస్ జవహర్‌రెడ్డికి ఫిర్యాదు
- కృష్ణా జెడ్పీ సమావేశంలో రచ్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల విభజన పాలనాపరమైన చిక్కులు తెస్తున్నట్లు కనిపిస్తోంది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చింది. దీనివల్ల పరిపాలనపరంగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లోకి పక్క జిల్లాల నియోజకవర్గాలు ఒకటి, రెండు కలవడం, మళ్లీ వాటికి యథాతథంగానే పాత విధానంలోనే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం తికమకగా మారింది. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో కలిపారు. కానీ ఆ నియోజకవర్గాలకు సంబంధించి జిల్లా పరిషత్ సమావేశాలను ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోనే నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు కైకలూరు, నూజివీడు ఎమ్మెల్యేలు హాజరవుతున్నా ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాకపోవడమే వివాదాస్పదంగా మారింది. తాజాగా మచిలీపట్నం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇదే అంశంపై మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరు తీరును తప్పుపడుతూ సమావేశం తీర్మానం చేయాలని సూచించారు. సమావేశాలకు రాకపోవడంపై కలెక్టరుకు లేఖ రాయాలని జెడ్పీ చైర్మన్‌కు పేర్ని నాని సూచించారు. లేకుంటే జెడ్పీటీసీలతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు. దీనిపై ఏలూరు కలెక్టర్ ఫోన్ ద్వారా స్పందించారు. జెడ్పీ సమావేశానికి తాను హాజరు కావాల్సిన అవసరం లేదని పేర్ని నానికి చెప్పడం మరింత వివాదానికి దారితీసింది. దీంతో కలెక్టర్ తాడేపల్లి వచ్చి సీఎంవో అధికారులకు వివరణ ఇచ్చారు.

సాంకేతిక అంశాలతో కలెక్టర్లు దూరం

జిల్లాల విభజన తర్వాత చాలాచోట్ల సాంకేతిక అంశాలతో జెడ్పీ సమావేశాలకు కలెక్టర్లు దూరంగా ఉంటున్నారు. కానీ ప్రజాసమస్యల దృష్ట్యా కలెక్టర్లు సమావేశాలకు హాజరు కావాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. మచిలీపట్నం కేంద్రంగా ఇదే సమస్య ఎదురైంది. ఏకంగా కలెక్టరే సమావేశానికి వెళ్లకపోవడం, ఆయనపై అధికార పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడం సీఎంవో అధికారులకు తలనొప్పిగా మారింది. దీన్ని మరింత వివాదం చేయకుండా సర్దుకుపోవాలని కలెక్టరుకు సీఎస్ సూచించినట్లు తెలిసింది. పేర్ని నాని సైతం వెనక్కి తగ్గకుండా సీఎస్ జవహర్ రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లా కలెక్టరుకు, వైసీపీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. ఏలూరు జిల్లా కలెక్టరు మచిలీపట్నంలో జరిగే సమావేశాలకు

- మిగతా 2 లో

మణిపూర్ అమానుష ఘటనపై
నిరసనజ్వాల

- 77 రోజులైనా చర్యలు తీసుకోకపోవడంపై ప్రజాగ్రహం
- మీరు చర్యలు తీసుకుంటారా...మేము తీసుకోమా: సుప్రీం

ఇంఫాల్: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన కలకలం సృష్టించింది. ఓ అల్లరి మూక ఇద్దరు గిరిజన మహిళలను ఎత్తుకెళ్లి, నగ్నంగా ఊరేగించి, వారిపై సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటనకు సంబంధించిన 26 సెకన్ల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన జరిగి 77 రోజులు అయినాగానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై

- మిగతా 2 లో

పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాల్సిందే

ఇండియా పార్లమెంటరీ పార్టీ భేటీ డిమాండ్

2 లో

నినాదాలతో గాయాలు మానిపోవు

గిరిజన మహిళల నగ్న ఊరేగింపు దేశానికి కళంకం: సీపీఐ

న్యూఢిల్లీ: మణిపూర్ రాష్ట్రంలో పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయని, ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం, వారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటం హేయమైన ఘటనని, దేశానికే కళంకమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఢిల్లీ నుంచి ఇంఫాల్ వరకు బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఈ హేయమైన నేరానికి పాల్పడిన దోషులే ప్రతిబింబమన్నారు. బేటీ బచావో, నారీ శక్తి పథకాలు తెచ్చి మహిళల రక్షణ, సాధికారత కోసం చాలా చేస్తున్నామని గొప్పలు పోయే బీజేపీ ప్రభుత్వ అసమర్థతకు తాజా ఘటన నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజలు ఇలాంటి నేరాలను ఎప్పటికీ క్షమించబోరని రాజా అన్నారు. మణిపూర్ సంక్షోభ

- మిగతా 2 లో

ఏజెన్సీ గ్రామాల్లో
వరద బీభత్సం

- పెరుగుతున్న గోదావరి, శబరి నీటి మట్టాలు
- ముంపు మండలాల నుంచి ప్రజల తరలింపు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి, శబరి నదుల నీటిమట్టాలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ

- మిగతా 2 లో

ఓటర్ల జాబితా సవరణపై
ప్రతి వారం సమాచారం

- శాశ్వత ఉద్యోగులే బీఎల్‌వోలు
- రాజకీయపక్షాల సమావేశంలో ముఖేశ్‌కుమార్ మీనా

2 లో

ఇదీ లోకం!

జగన్, బాబుకు యూసీసీ పరీక్ష

- మైనారిటీ ఓట్లపై ఆందోళన
- బీజేపీ పొత్తుపై టీడీపీ తడబాటు
- పవన్‌కు తప్పని ముప్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) వివాదం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడికి తలనొప్పిగా మారినట్లు కనిపిస్తోంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ రెండూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కేంద్రంలో బీజేపీకి అండగా నిలుస్తున్నాయి. ఇప్పుడు యూసీసీ బిల్లును మోదీ సర్కారు పార్లమెంటులో ప్రవేశపెట్టబోతుంది. ఇదే సమయంలో బుధవారం ముస్లిం వర్గాలు ఇటు జగన్‌ను, అటు చంద్రబాబును కలిసి... యూసీసీపై చర్చించినట్లు తెలుస్తోంది. యూసీసీ ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీకి సవాల్‌గా మారింది. ఈ బిలున్లు ప్రవేశపెడితే కేంద్ర ప్రభుత్వాన్ని ఎలా ఎదుర్కొనాలనే దానిపై ఆ రెండు పార్టీలు తర్జనభర్జన పడుతున్నాయి. కీలకమైన బిల్లులకు చట్టసభల్లో వైసీపీ మద్దతిస్తోంది. మరి యూసీసీ సభ ముందుకు వస్తే పరిస్థితి ఏమిటని రెండు పార్టీలు ఆలోచనలో పడ్డాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి ముస్లిం, క్రైస్తవులు జగన్‌కు అండగా నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఆ వర్గాలు వైసీపీని భారీ మెజారిటీతో గెలిపించాయి. టీడీపీకి కోలుకోలేని దెబ్బతగిలింది. దీంతో వైసీపీ తన

- మిగతా 2 లో

వెనిజులాపై ఆంక్షల్ని ఎత్తివేయాలి

- గతాన్ని మరిచి యూరప్‌తో కొత్త సంబంధాలను కోరుతున్నాం
- సెలాక్-ఈయూ సదస్సులో మదురో

బ్రసెల్స్: వెనిజులాపై అనైతిక, అక్రమ, నేరపూరిత ఆంక్షలన్నింటిని బేషరతుగా ఎత్తివేయాలని ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో డిమాండ్ చేశారు. గతాన్ని మరిచి యూరప్‌తో దౌత్యపరంగా సంబంధాల పునరుద్ధరణను కోరుకుంటున్నట్లు తెలిపారు. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు (సెలాక్), యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ తమ వాస్తవికతను వెల్లడించడం ద్వారా వెనిజులా గతంలో జీవించాలని అనుకోవడం లేదని యూరప్ గ్రహిస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. మళ్లీ జోక్యం, వలసవాద కాలంలోకి వెళ్లాలని లేదని యూరోప్ అర్థం చేసుకోగలదని ఆయన ఆకాంక్షించారు. తాము గౌరవాన్ని కోరుకుంటున్నామని, అది లభిస్తే అన్ని సాధ్యమవుతాయని మదురో అన్నారు. 'మా సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్ని గౌరవించాలి. మా దేశంపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలి. అవి అనైతికమైనవి. అక్రమమైనవి, నేరసూరితమైనవి, ఆమోదయోగ్యం కానివి. బేషరతుగా వాటన్నింటిని రద్దు చేయాలి. దేశంలో అంతర్గతంగా ఏం జరిగినాగానీ వాటిని వెనిజులా ప్రజలు అంగీకరించబోరు' అని మదురో నొక్కిచెప్పారు. వెనిజులా శాంతంగా జీవించాలనుకునే దేశమని, ఆంక్షలను ఎత్తివేస్తేనే అది సాధ్యమన్నారు. అంతేకాకుండా ఆర్థికపరంగా పరస్పర ఆధారానికి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యూరప్ పెట్టుబడిదారులు వెనిజులాకు రావాలని అనుకుంటున్నారని, ఇంధనం, గ్యాస్, పెట్రోకెమికల్స్ వ్యవసాయం, పర్యాటకం, తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వారిని ఆహ్వానిస్తున్నామని మదురో అన్నారు. యూరోపియన్ యూనియన్-వెనిజులా దౌత్య బంధాన్ని కొత్తగా ప్రారంభించుకోవడం అవసరమన్నారు. గతంలో అధ్యక్షుడు జువాన్ గ్వైడో పాలనను ఆపాదించాలని అమెరికా యత్నించిందని, ఎవరూ ఎన్నుకోని వ్యక్తిని అధ్యక్షుడిగా తెచ్చి పెట్టి, ఆయన పాలనను అమలు చేయాలనుకోవడం నేరమని అన్నారు. ఏళ్లు గడిచిన క్రమంలో వెనిజులాకు నిజమైన అధ్యక్షుడు ఎవరన్నది తేలిపోయిందని మదురో నొక్కిచెప్పారు. తమ దేశంపై దాడులను వెనిజులా తిప్పికొట్టిందని చెబుతూ యూరప్, వెనిజులా మధ్య కొత్త చరిత్ర సృష్టించాలని మదురో ఆకాంక్షించారు.

సెలియా గువేరా మృతి

బ్యూనస్ ఎయిర్స్: విప్లవయోధుడు చే గువేరా సోదరి సెలియా గువేరా డి లా సెర్నా (93) అర్జెంటైనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో మృతిచెందారు. 1929లో జన్మించిన సెలియా గువేరా... చేగువేరా కంటే ఏడాదిన్నర చిన్నవారు. సెలియా మరణాన్ని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికన్ ఆర్ట్ అండ్ ఈస్తటిక్ రీసెర్చ్ 'మారియో జె బస్చియాజో', ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ యూనివర్సిటీ బ్యూనస్ ఎయిర్స్ ధృవీకరించాయి. ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా, అనేక పరిశోధన ప్రాజెక్టుల డైరెక్టర్‌గా, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్కిటెక్ట్‌గా, స్పెషలిస్ట్‌గా ఉన్న సెలియా గువేరా మృతి చెందినట్లు ప్రకటించడం బాధాకరమని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నాయి. సెలియా గువేరా ప్రత్యేకించి గ్రేటర్ బ్యూనస్ ఎయిర్స్ (జీబీఏ) ఉత్తర కారిడార్‌లో శాస్త్రీయ సమావేశాల్లో పాల్గొన్నట్లు ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. ఆమె సేవలు మరుసవలేనివిగా పేర్కొంది.

ప్రజాస్వామ్యానికి ముప్పు

ఆందోళనలపై పెరూ అధ్యక్షురాలు దీనా

లిమా: పెరూ అధ్యక్షురాలు దీనా బలౌర్టె గద్దె దిగాలని ఆ దేశంలో నిరసనలు మిన్నంటాయి. ఆందోళనలు, ప్రదర్శనలతో దేశం హోరెత్తుతోంది. అధ్యక్షురాలి రాజీనామాకు నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అనేకమంది ప్రాణాలను కోల్పోయారు. పెరూలో నిరసనలను ప్రజాస్వామ్యానికి ముప్పుగా దీనా అభివర్ణించారు. ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగించే హక్కు పెరూ ప్రజలకు లేదన్నారు. శాంతియుత నిరసనలకు పిలుపులపై స్పందిస్తూ తమది ప్రజాస్వామిక ప్రభుత్వమని, సంస్థాగతంగా, న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్యానికి ముప్పును తలపెట్టనివ్వమని అన్నారు. నిరసనలు శాంతియుతంగా జరగాలని ఇతర హక్కులను హరించేందుకు ఆస్కారం లేకుండా ప్రదర్శనల వెంట ప్రాసిక్యూటర్ ఆఫీసు తరహా సంస్థల ప్రతినిధులు ఉంటారని చెప్పారు. అయితే 24వేల మంది పోలీసులను మోహరించగా అందులో 11 వేల మంది వరకు రాజధాని లిమాలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీనా బలౌర్టె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు మొదలైనప్పటి నుంచి మానవహక్కులు ఉల్లంఘనలు విపరీతంగా జరిగినట్లు పెరూ ప్రజల్లో 81శాతం మంది చెప్పారు. నిరసనలపై ప్రభుత్వ వైఖరిని న్యూవో పెరూ పార్టీకి చెందిన వెరోనికా మెండోజా విమర్శించారు. బెదిరించాలని, హింసాత్మక ఘటనలను న్యూవో పెరూ పార్టీకి ముడిపెట్టాలని చూస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న వారు హింసను ప్రోత్సహిస్తున్నారని, ప్రజలపై కాల్పులు జరుపుతున్నారని, హత్యలకు సాయుధ దళాలే నేరుగా బాధ్యత వహించాల్సి ఉందని అన్నారు. తామెప్పుడు శాంతిని పెంపొందిస్తామని వెరోనికా చెప్పారు.

ఊమెన్ చాందీ అంత్యక్రియలు పూర్తి

చివరి చూపుకోసం వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

కొట్టాయం (కేరళ): కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వేలాది మంది అభిమానుల అశ్రు నయనాల నడుమ కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ అంత్యక్రియలు గురువారం ముగిశాయి. ఆయన సొంత నియోజకవర్గం కొట్టాయం జిల్లా పుత్తుపల్లిలో ని చర్చి ఆవరణలో ప్రత్యేకంగా నిర్మించిన సమాధిలో అయన భౌతికకాయాని ఖననం చేశారు. ఊమెన్ చాందీ(79) అంతిమయాత్రకు భారీగా జనం తరలివచ్చారు. కొల్లాం నుంచి కొట్టాయం వరకు వివిధ ప్రాంతాలకు చెం దిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు... తమ ప్రియతమ నేతకు నివాళులర్పించారు. ఊమెన్ చాందీ భౌతిక దేహాన్ని చూసేందుకు రోడ్డు ఇరువైపులా ప్రజలు బారులు తీరారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఊమెన్ చాందీ అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. 'చాందీ చనిపోలేదు.. అతను మనలో జీవించి ఉన్నారు', 'ఆయన లాంటి మరొక నాయకుడు ఇంకొక లేరు' వంటి నినాదాలతో హోరెత్తించారు. చాందీ భౌతికకాయం వద్ద కొట్టాయంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మ ద్ ఖాన్, సినీ నటులు మమ్ముట్టి, సురేశ్ గోపీ నివాళులర్పించారు. చాందీ భౌతికకాయాన్ని తీసుకొచ్చే వాహనం బెంగళూరు నుంచి కొట్టాయంకు 24 గంటలు ఆలస్యం గా వచ్చింది. కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ ఊమెన్ చాందీ(79) మంగళవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

'పాలన' రగడ

(మొదటిపేజీ తరువాయి)

రాకపోవడంతో కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల సమస్యలను ఎవరు ఆలకిస్తారని అక్కడి ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. కైకలూరు ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు, నూజివీడు ఎమ్మెల్యేగా మేకా ప్రతాప అప్పారావు కొనసాగుతున్నారు. వారిద్దరూ అధికార ఎమ్మెల్యేలే అయినప్పటికీ వారి నియోజకవర్గ సమస్యలు ప్రశ్నార్థకమయ్యాయి.

వ్యవస్థలకు భంగం కలగకూడదనే: పేర్ని నాని

వ్యవస్థలకు, విలువలకు భంగం కలగకూడదనే ఏలూరు జిల్లా కలెక్టరు తీరుపై తాను ప్రభుత్వం ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు పేర్ని నాని స్పష్టం చేశారు. నాని గురువారం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరు తనకు ఫోన్ చేసి కృష్ణా జిల్లా పరిషత్ సమావేశానికి తాను హాజరు కావడం తప్పనిసరి కాదని, ఆ విషయం తెలుసుకోవాలన్నారని తెలిపారు. కలెక్టరు వ్యాఖ్యలతో వాస్తవాలు తెలుసుకునేందుకు సచివాలయానికి వచ్చి ఉన్నతాధికారిని కలిశానని వివరించారు. కలెక్టరు జెడ్పీ సమావేశాలకు వెళ్లాల్సిందేనని అధికారులు చెప్పారన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తానని సీఎస్ భరోసా ఇచ్చారని వివరించారు. కలెక్టర్లు రాకపోతే నియోజకవర్గాల సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని నాని ప్రశ్నించారు. తాను ఎన్నిసార్లు కలెక్టరుకు చెప్పినా వినలేదన్నారు. కలెక్టరుకు, తనకూ ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని పేర్ని నాని స్పష్టం చేశారు.

సీఎంఏ విజయవాడ చాప్టర్ నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ వారు స్థానిక పటమట కరణం గారి వీధిలో నిర్మించి నూతన భవనాన్ని సంస్థ అధ్యక్షులు విజేందర్ శర్మ ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ చాప్టర్ చైర్మన్ సీతారామ స్వామి, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కౌన్సిల్ సభ్యులు, రీజినల్ కౌన్సిల్ సభ్యులు విజయవాడ చాప్టర్ సభ్యులు, విజయవాడ చాప్టర్ మేనేజింగ్ కమిటీ సభ్యులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో రేఖశర్మ, శంకర్ పాణికర్, పద్మనాభన్, సుంకర పాపారావు, వినయ్ రంజన్, సుంకర పూర్ణిమ పాల్గొన్నారు.

జగన్, బాబుకు యూసీసీ పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

మైనార్టీ ఓటు బ్యాంకును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అదే బాటలోకి టీడీపీ వచ్చింది. ఎంపీ సీట్లు ఎక్కువగా గల వైసీపీ...ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. టీడీపీ కూడా బిల్లును వ్యతిరేకించాలి. లేకుంటే రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీలకు మైనార్టీలు గుణపాఠం చెప్పే ప్రమాదముంది.

భేటీలకే జగన్, చంద్రబాబు పరిమితమా?

యూసీసీ బిల్లు తెరపైకి రావడంతో జగన్, చంద్రబాబును వేర్వేరుగా ముస్లిం సంఘాలు, మతపెద్దలు, సొంత పార్టీ ప్రజా ప్రతినిధులు బుధవారం కలిశారు. యూసీసీ బిల్లులో ఏముంది? అది పార్లమెంటు ముందుకు వస్తే తిరస్కరించాలని అభ్యర్థించారు. దానికి సీఎం జగన్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వం మీదేనంటూ చెప్పుకొచ్చారు. అటు చంద్రబాబును ఆ పార్టీ ముస్లిం నేతలు కలిసి యూసీసీ బిల్లుకు మద్దతు ఇవ్వొద్దని కోరారు. ఈ రెండు భేటీలు చర్చనీయాంశంగా మారాయి. కేవలం ముస్లిం సంఘాల భేటీలతోనే సరిపెడతారా?, కేంద్రాన్ని గట్టిగా నిలదీస్తారా? అనేది అనుమానమే. 9 ఏళ్ల నుంచి వైసీపీ, టీడీపీ రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని నిలదీయలేకపోయాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించలేకపోయాయి. రెండు పార్టీలు రాజకీయ స్వలాభం, మనుగడ కోసం ప్రయత్నించాయి తప్ప రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. యూసీసీ ముసాయిదా బిల్లు ఇంకా తయారు కాలేదని అఖిలపక్ష సమావేశం అనంతరం ఢిల్లీ కేంద్రంగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. అయినా ఏదో సమయంలో బీజేపీ యుద్ధప్రాతిపదికన బిల్లు తెస్తుందనే ఆందోళన ముస్లిం వర్గాల్లో ఉంది. దీంతో యూసీసీ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆందోళనకు ముస్లిం సంఘాలు సిద్ధమవుతున్నాయి.

పవన్ పొత్తు వ్యాఖ్యలపై టీడీపీ మౌనం

వచ్చేఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని ఢిల్లీ కేంద్రంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు ఇంతవరకు స్పందించలేదు. ఎన్‌డీఏ భేటీ కోసం పవన్‌కు ఆహ్వానం రావడం, ఆయన హడావుడిగా ఢిల్లీ పరుగులు తీయడం తెలిసిందే. ప్రధాని మోదీతో ఫొటోలు దిగారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధరన్‌తో భేటీ అయ్యారు. చర్చలు ఫలవంతమని ట్వీట్లు పెట్టారు. ఓ పక్క టీడీపీతో కలిసి వెళతామని పవన్ చెబుతుండగా...చంద్రబాబు మాత్రం బీజేపీతో పొత్తుపై మౌనం వహిస్తున్నారు. దీనిపై చంద్రబాబు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో యూసీసీ బిల్లు తెరపైకి రావడం బీజేపీతో పొత్తు బీజేపీకి పెద్ద ఆటంకంగా మారింది. బీజేపీతో జతకట్టిన పవన్ తీరును వామపక్ష పార్టీలు తప్పుబడుతున్నాయి. టీడీపీకి పవన్ మధ్యవర్తిగా మారారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించగా...జనసేన ఎన్డీఏలో చేరడం ఆత్మహత్యా సదృశ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. చంద్రబాబు కూడా బీజేపీ చంకనెక్కితే ఆయనకూ ఇలాంటి మాటలు తప్పవు. దానికితోడు టీడీపీకి మైనారిటీలు మరింత దూరమయ్యే ప్రమాదముంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రెండు మీడియా సమావేశాల్లోనూ పొత్తులపై టీడీపీ ప్రస్తావన తీసుకురాలేదు. జనసేన, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందని మాత్రమే ఆమె స్పష్టంచేశారు. బీజేపీ రాజకీయ ఎత్తుగడలను దృష్టిలో ఉంచుకుని ఎన్డీఏలో చేరికపై టీడీపీ తర్జనభర్జన పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

గమ్యం దిశగా చంద్రయాన్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఈనెల 14న చంద్రయాన్ -3 విజయవంతంగా ప్రయోగించిన అనంతరం కక్ష పెంపు దశలవారీగా జరుగుతుతోంది. ఇక చివరిగా ఐదో కక్ష పెంపు జరిగితే చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-3 ప్రవేశిస్తుంది. అంతా అనుకున్నట్లు జరిగితే ఆగస్టు 23వ తేదీ సాయంత్రానికి చంద్రుడిపై దిగుతుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆకాంక్షించారు. వర్చువల్‌గా జరిగిన స్టార్ట్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 ద్వారా సైన్స్‌కు సంబంధించి కీలకమైనదేదో తెలుసుకోగలమన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. సౌర మిషన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. దేశంలోని తొలి పోలారిమెట్రీ మిషన్ ఎక్స్‌పీహోశాట్ దాదాపు సిద్ధంమన్నారు. సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టే ఆదిత్య-ఎల్1 మిషన్ పనులు వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. ఎక్సో ఉపగ్రహాల అధ్యయనం కోసం శాటిలైట్ తయారీపై, భవిష్యత్ చంద్రుడి మిషన్లపై చర్చలు జరుగుతున్నట్లు సోమనాథ్ వెల్లడించారు. తీవ్ర పరిస్థితుల్లో ఎక్స్‌రే డైనమిక్స్‌పై అధ్యయనానికి సిద్ధమవుతోందన్నారు. తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంపెక్స్ (ఐపీఆర్‌సీ) నుంచి గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్ఎంపీఎస్)ను విజయవంతంగా ఇస్రో పరీక్షించింది. 250 సెకన్ల పరీక్ష విజయవంతమైనట్లు ప్రకటించింది.

ఓటర్ల జాబితా సవరణపై ప్రతి వారం సమాచారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ప్రతి వారం రాజకీయ పక్షాలకు నియోజకవర్గస్థాయిలో సమాచారం అందిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. లోపాలు లేని ఓటర్ల తుది జాబితా కోసం ఈ అవశాశాన్ని రాజకీయ పక్షాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పక్షాలతో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై సచివాలయంలోని ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయంలో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లా డుతూ ఓటరు నమోదు దరఖాస్తుల పరిష్కారం, బీఎల్‌ఓల పాత్ర, ఈఆర్‌ఓలు తీసుకోవలసిన చర్యలకు సంబంధించి జారీ చేసిన ఏకీకృత సూచనలను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువచ్చారు. ఈఆర్‌ఓలు ప్రతి వారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాను నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీలకు అందిస్తారని, దానినే సీఈఓ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు.

నినాదాలతో గాయాలు మానిపోవు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని విమర్శించారు. హింస, అల్లర్లు, మూక హత్యలు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఉన్నదన్నారు. కేవలం నినాదాలు ఇవ్వడం ద్వారా గాయం మానిపోదని మహిళల నగ్న ఊరేగింపు, అత్యాచారాలను ఉద్దేశించి రాజా వ్యాఖ్యానించారు. సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం స్పందిస్తూ ఇంతటి సిగ్గుచేటు ఘటన జరిగిన నేపథ్యంలో జీ20 అధ్యక్షతను ప్రధాని మోదీ ఎలా చేపట్టగలరని ప్రశ్నించారు. నారీశక్తి ఏమైందని నిలదీశారు. ఏ ముఖం పెట్టుకొని జీ20కి నేతృత్వం వహిస్తారని ట్విట్టర్ మాధ్యమంగా ప్రశ్నించారు. 'సంఘ్ ముక హింస సంస్కృతి'కి మణిపూర్‌లోని అమానవీయ ఘటన అద్దం పట్టిందని సీపీఐ ఎంఎల్ అధ్యక్షుడు దీపాంకర్ భట్టాచార్య వ్యాఖ్యానించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ పాలన వాస్తవ పరిస్థితులను బట్టబయలు చేసిందన్నారు. ప్రధాని మోదీ మౌనం వహించడం ఈ నేరాన్ని సమర్థించడమే అవుతుందని ట్వీట్ చేశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పందిస్తూ నేరం జరిగి 77 రోజులైతే మణిపూర్ అధికారులు, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చర్యలు తీసుకోవడంలో బాధితులకు న్యాయం చేయడంలో ఎలాంటి తొందర లేదని ఆయన ట్విట్టర్ మాధ్యమంగా విమర్శించారు.

మోదీజీ ఇప్పటికైనా మేల్కోండి: ప్రధాని మోదీకి వినయ్ విశ్వం లేఖ

నిద్రావస్థను వీడాలని, మణిపూర్ హింసపై ప్రకటన చేయాలని కోరుతూ వినయ్ విశ్వం గురువారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. గిరిజన మహిళల వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని, సరిహద్దు రాష్ట్ర ప్రజల్లో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు కసరత్తు చేయాలని కోరారు. ఈ వీడియో దేశానికి కళంకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అపఖ్యాతిని తెస్తుందని, దీనిని సులువుగా మర్చిపోలేరని పేర్కొన్నారు. హేయమైన ఘటన నేపథ్యంలో ఏ ముఖం పెట్టుకొని జీ20కి అధ్యక్షత వహిస్తారని ప్రశ్నించారు. ఈశాన్య రాష్ట్ర ప్రజల్లో విశ్వాసాన్ని నింపేలా సముచిత చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతల క్షీణత, మహిళలకు గౌరవం లేకపోవడం, ప్రభుత్వ అధికారుల అసమర్థతకు తాజా ఘటన అద్దం పట్టిందన్నారు. తగు విధంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు ప్రతిపక్షాలతో పాటు సుప్రీం కోర్టు కూడా నిలదీసిందని గుర్తుచేశారు. హేయమైన నేరానికి పాల్పడిన వారు నెలలు గడుస్తున్నా స్వేచ్ఛగా తిరుగుతుండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని, మణిపూర్ విషయంలో మోదీ మౌనం కారణంగానే మూకలు రెచ్చిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పడంలో డుబుల్ ఇంజిన్ ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు. 'మణిపూర్ సంక్షోభానికి పరిష్కరించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల తీరు నిరాశాజనకం. అక్కడ హింస, అల్లర్లు, హత్యలకు అంతు లేకుండా పోయింది. మత శక్తుల దయకు ప్రజలను వదిలేశారు. మహిళా సాధికారతకు నినాదాలు ఇవ్వడం సరిపోదు వారి రక్షణ, సాధికారత సంక్షేమానికి చర్యలు కూడా తీసుకోవాలి. 'యత్ర నార్యస్తు పూజ్యంతె. రమంతె తత్ర దేవతా' అనే సంస్కృత శ్లోకాన్ని పదేపదే వల్లిస్తుంటారు. బేటీ బచావో బేటీ పడావో అంటారు. కానీ మణిపూర్‌లో మహిళలు కేవలం అవమానాలు, అత్యాచారాలు, లైంగిక దాడులు, నగ్న ఊరేగింపులతో తల్లడిల్లిపోతున్నారు. మీరిచ్చే నినాదాలతో దేశ మహిళల గాయాలు మానిపోవని గ్రహించాలి' అని లేఖలో వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు.

పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాల్సిందే

ఇండియా పార్లమెంటరీ పార్టీ భేటీ డిమాండ్

న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంటులో ప్రకటన చేయాలని, తర్వాత చర్చకు అనుమతించాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు విపక్ష కూటమి ఇండియా నాయకులు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖడ్గే చాంబర్‌లో గురువారం సమావేశమయ్యారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బెంగళూరు భేటీలో విపక్షాల కూటమికి ఇండియా అని నామకరణం చేసిన తర్వాత మొదటిసారి విపక్షాల పార్లమెంటరీ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు ఉద్వాసన పలికి... రాష్ట్రపతి పాలన విధించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత కూడా అయిన మల్లికార్జున ఖడ్గే డిమాండ్ చేశారు. మణిపూర్‌పై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదా తీర్మానాలు ఇచ్చారు. ఖడ్గే కూడా వాయిదా తీర్మానం ఇచ్చారు. మణిపూర్‌లో హింస చెలరేగి 80 రోజులు దాటిందని, కానీ దీనిపై ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించడం గానీ లేదా అక్కడి పరిస్థితిపై ఒక్క మాట మాట్లాడటం గానీ చేయలేదని ఖడ్గే విమర్శించారు. మే నుంచి మణిపూర్‌లో జరుగుతున్న భయానక పరిణామాలపై ప్రధాని మోదీ ఉభయసభల్లో ప్రకటన చేయాలని 26 పార్టీలతో కూడిన కూటమి ఇండియా డిమాండ్ చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. పార్లమెంటులో ఇదే అంశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'మణిపూర్ మండుతోంది. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. నగ్నంగా ఊరేగిస్తున్నారు. భయోత్పాతం సృష్టించేలా హింస కొనసాగుతోంది. అయినా మోదీ మాత్రం నోరు విప్పడం లేదు' అని ట్విట్టర్ వేదికగా ఖడ్గే విమర్శలు గుప్పించారు. రెండున్నర మాసాలుగా హింస కొనసాగడం, సభ్యసమాజం సిగ్గుపడేలా ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానుష ఘటన వీడియో ద్వారా బహిర్గతం కావడం, దీనిపై యావత్ ప్రపంచం తీవ్రంగా స్పందించడంతో మోదీ ఈ రోజు పార్లమెంటు బయట స్పందించారని విమర్శించారు. మణిపూర్‌పై పూర్తిస్థాయి చర్చను తాము కోరుకుంటున్నామని, పార్లమెంటులో ప్రధాని సవివరమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ముఖ్య మంత్రి బీరేన్‌సింగ్ తక్షణమే రాజీనామా చేసి...రాష్ట్రపతి పాలన విధించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. మణిపూర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ ఖడ్గేతో పాటు నసీర్ హుస్సేన్, మనీశ్ తివారీ, జ్యోతిమణి, ప్రియాంక చతుర్వేది, నామా నాగేశ్వరరావు వాయిదా తీర్మానాలిచ్చారు.

వరద బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. గురువారం ఉదయం 8.00 గంటలకు 39.5 అడుగులున్న గోదావరి... క్రమ క్రమంగా పెరుగుతూ సాయంత్రం 6.00 గంటలకు 43.30 అడుగులకు చేరుకుంది. మరోవైపు చత్తీస్‌గఢ్‌లో కూడా భారీ వర్షాలకి శబరి ప్రవాహం కూడా అమాంతం పెరిగింది. దీంతో విలీన మండలాలైన దేవీపట్నం, చింతూరు, ఎటపాక, వీఆర్ పురం, కూనవరం మండలాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో ఆయా మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితిని గమనించిన జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసింది. కొన్ని గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు, సుర క్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వరద సహాయక సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉంటూ వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. వరద మరింత పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతా లకు తరలించేందుకు లాంచీలు, మర పడవలను సిద్ధంగా ఉంచారు. గ్రామాల్లోకి వరద ప్రవేసిస్తే ఇళ్లను ఖాళీచేయించి వాటిద్వారా ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని తరలించేందుకు కూడా లాంచీలు, పడవలను వినియోగించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన గర్భిణులు, డయాలసిస్ రోగులను ముందస్తుగా సురక్షిత ప్రాంతాల్లోని ఆసుపత్రికి తరలించారు.

నీట మునిగిన పోచమ్మ ఆలయం

అల్లూరి జిల్లా దేవీపట్నం దేవీ పట్నం మండలం పోచమ్మ గండి ఆలయాన్ని గోదావరి ముం చెత్తింది. అమ్మవారి ఆలయ గోపురం వరకు వరదనీరు చేరింది. దండంగి పురుషోత్తపట్నం అర్అండ్ బీ రహదారి పైకి వరదనీరు చేరడంతో పోచమ్మగండికి రాక పోకలు పూర్తిగా స్తంభించాయి. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ కారణంగా పోచమ్మగండి వద్ద వరద ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. అమ్మవారి ఆలయానికి భక్తులెవరూ రావొద్దని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. గోదావరి పోటు కారణంగా దండంగి నాగుకు సీతారం వరకూ వరదనీరు పోటెత్తింది.

కూనవరం మండలంలో

కూనవరం మండలంలో శబరి, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో లోతట్టు కాలనీల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానిక గిన్నెలబజారు, ఉదయ భాస్కర్ కాలనీ ప్రజలను ఏపీ ఆర్ గురుకుల పాఠశాలకు తరలి వెళ్లాల్సిందిగా కూనవరం ఎస్సై వెంకటేష్, తహసిల్దార్ అనసూర్య అప్రమత్తం చేశారు. శబరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండల కేంద్రం నుంచి శబరి కొత్తగూడెం, కొండరాజుపేట, పూసుగూడెం, జిల్లెల్లగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన జనజీవనం స్తంభించింది.

నిరసనజ్వాల

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. మీరు చర్యలు తీసుకుంటారా లేక మమ్మల్ని జోక్యం చేసుకోమంటారా అని కేంద్రంతో పాటు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చీవాట్లు పెట్టింది. దీంతో చర్యలకు పూనుకున్న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు దోషులను ఉపేక్షించేది లేదని ప్రకటించాయి. వీడియో ఆధారంగా నాంగ్‌పోక్ సెక్మై పోలీసు స్టేషన్‌లో గుర్తుతెలియని సాయుధులపై అపహరణ, సామూహిక అత్యాచారం, హత్యారోపణలతో కేసు నమోదైంది. మణిపూర్ పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడిని అరెస్టు చేయగా అతనిని 32ఏళ్ల హీరాదాస్‌గా గుర్తించారు. అప్పట్లో పరిస్థితులు తీవ్రంగా క్షీణించడం, సంక్షోభ నివారణ, సహాయక చర్యలపైనే దృష్టి పెట్టడంతో చర్యలు ఆలస్యమైనట్లు ప్రభుత్వ వర్గాలు సమర్థించుకునే ప్రయత్నం చేశాయి. ప్రసుత్తం అనేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి ముఖ గుర్తింపు సాంకేతికత ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు వెల్లడించాయి. దోషులకు మరణ శిక్ష విధించే అంశం పరిశీలనలో ఉన్నట్లు ఈశాన్య రాష్ట్ర సీఎం బీరేన్ సింగ్ తెలిపారు. పార్లమెంటులోనూ మణిపూర్ అంశంపై ఉభయ సభలు దద్దరిల్లాయి. అసమర్థ ముఖ్యమంత్రి రాజీనామాకు కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శలు, ధర్నాలను రాజకీయ, ప్రజా సంఘాలు చేపట్టాయి. ఈ అమానవీయ, అనాగరిక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గిరిజన సంఘాలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. 'మణిపూర్‌లో ఆడబిడ్డలకు జరిగినది ఒకవైపు బాధిస్తోంది. మరోవైపు కోసం తెప్పిస్తోంది. ఇది ఎప్పటికీ మరువలేం. 140కోట్ల మందికి సిగ్గుచేటు' అని ప్రధాని మోదీ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన సూచించారు. మణిపూర్‌లో మానవత్వం చచ్చిపోయిందని, ఇది ప్రజాస్వామ్యం కాదు మూకస్వామ్యమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ ఇంతటి క్రూరమైన నాయకుడు మరెవ్వరూ ఉండరని, మణిపూర్ తగలబడిపోతుంటే మోదీ మౌనం వహిస్తున్నారని విమర్శించారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని, తాజా ఘటన హేయమైనదని, కలచివేసిందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. ఇంతటి ఘోరమైన వీడియో తనను షాక్‌కు గురిచేసినట్లు మిజోరం ముఖ్యమంత్రి జోరంథంగా అన్నారు. కేవలం కేంద్రమే మణిపూర్ సమస్యను పరిష్కరించగలదని, ఈ పెద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని చెప్పారు. మే 3వ తేదీ నుంచి మణిపూర్‌లో హింస జరుగుతూనే ఉంది. ఇప్పటివరకు 160 మంది వరకు చనిపోయారు.

పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు

ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధి

బోధనలో, శిక్షణలో వినియోగంపై సీఎం సమాలోచనలు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యవరకు విద్యార్థులకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖాధికారులు, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావిప్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో ఫ్యూచర్ టెక్నాలజీ బోధనలో, శిక్షణలో వినియోగంపై సీఎం సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉన్నత విద్యలో మరింత మెరుగైన సంస్కరణలు అవసరమన్నారు. భారతదేశంలో ఏఐ వంటి వర్టికల్స్ అభివద్ధి చాలా తక్కువగా ఉండటం, వాటిని బోధించే సిబ్బంది కొరత కూడా అధికంగా ఉందని, వీటిని పాఠ్యప్రణాళికలో భాగం చేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఉదాహరణకు ఫైనాన్స్ సబ్జెక్ట్‌నే తీసుకుంటే... బీకామ్ కాకుండా మరో వర్టికల్ ఇందులో లేదు. బికామ్‌లో ఫైనాన్స్‌కు సంబంధించిన ఇతర వర్టికల్స్ ఏవీ అందుబాటులో లేవు. అక్కడితో ఆగిపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రిస్క్ మేనేజిమెంట్, అసెట్ మేనేజిమెంట్, రియల్ ఎస్టేట్ మేనేజిమెంట్, ఫైనాన్స్ వంటి అంశాలను కరిక్యులమ్‌లో భాగంగా చేయాలి. ఎందుకు వీటిని కరిక్యులమ్‌లో భాగంగా అందుబాటులోకి తీసుకుని రాలేకపోతున్నామంటే.. ఈ వర్టికల్స్‌ను బోధించే సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడమేనన్నారు. వీటికి సంబంధించిన కంటెంట్ అందుబాటులో ఉన్నా అమల్లోకి తీసుకునిరాలేని పరిస్థితి. పాశ్చాత్య దేశాలలో వీటికి సంబంధించిన బోధనా సిబ్బంది ఉన్నారు. ఇవన్నీ అక్కడ కరిక్యులమ్‌లో భాగంగా ఉన్నాయి. వర్చువల్ రియాలిటీ, అగ్‌మెంటెడ్ రియాలటీ వంటి అంశాలు కరిక్యులమ్‌లో చేర్చాలి. ఇది కేవలం ఒక సంస్థకే పరిమితం కాకుండా... పెద్ద సంఖ్యలో స్కూళ్లు, కాలేజీల్లో ఈ కరిక్యులమ్‌ని తీసుకునిరావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఒక తరంలో వీటిని మనం నేర్పించగలిగితే... ఆయా వర్టికల్స్‌లో మనం నిపుణులను తయారుచేయగలుగుతామని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశాలను మన కరిక్యులమ్‌లో భాగంగా చేర్చకపోతే.. మన పాఠ్యప్రణాళిక బలపడదని, అంతర్జాతీయంగా పోటీపడలేమని స్పష్టం చేశారు. దీనిని స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఎలా సమ్మిళతం చేయాలన్న దానిపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. మన పిల్లలను ప్రపంచ స్థాయికి తీసుకుపోవాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. అత్యుత్తమ ఐటీ నిపుణులు, కంపెనీ ప్రతినిధులకుగా నిలబెట్టాలన్నది మా ఆశయం. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, మైక్రోసాఫ్ట్ లెర్నింగ్ అండ్ స్కిల్క్ లీడ్ డాక్టర్ విన్నీ జౌహరి, ఇంటెల్ సీనియర్ డైరెక్టర్(ఏసియా పసిఫిక్ అండ్ జపాన్) శ్వేత ఖురానా, నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంధ్య చింతాల, ప్రైమస్ పార్టనర్స్ ఇండియా కో ఫౌండర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ చారు మల్హోత్ర, ప్రైమస్ పార్టనర్స్ ఇండియా ఎడ్యుకేషన్ కన్సెల్టెంట్ పూజ క్వాత్రా, సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ జైజిత్ భట్టాచార్య, అమెజాన్ వెబ్ సర్వీసెస్ హెడ్ ఆఫ్ స్కిల్స్ టు జాబ్స్ (ఇండియా అండ్ సౌత్ ఏసియా) డిపి సింగ్, గూగుల్ లీడ్ ఎడ్యుకేషన్ శ్రీనివాస్ గరిమెళ్ల, మైక్రోసాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రామ్ మేనేజర్ కిషోర్ గార్గ్, డేటావివ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ వేదాంత్ అహ్లువాలియా, డేటావివ్ బోర్డు మెంబర్ అతుల్ కుమార్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సమగ్రశిక్షా అభియాన్ ఎస్‌పీడీ బి శ్రీనివాసరావు, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (మౌలిక వసతులు కల్పన) కాటమనేని భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సి ఎన్ దీవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: పేద బడుగు బలహీన వర్గాలు, కష్టజీవులకు అండగా ఉండి పోరాడేది కమ్యూనిస్టులేనని ఇది చరిత్ర రుజువు చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు ఇక్కడ జరుగుతున్న సీపీఐ జిల్లాస్థాయి శాఖ వర్క్ షాప్‌లో గురువారం సాయంత్రం పార్టీ ప్రోగ్రాంను వివరించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను వివరించారు. ఇప్పటికీ దేశంలో నెలకొన్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే అని అన్నారు. రాష్ట్రంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్నదని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల వద్దకు వెళ్లి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ తద్వారా పార్టీ నిర్మాణం బలోపేతం చేయాలన్నారు. భారత సంస్కృతి, సంప్రదాయం అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు డి సోమసుందర్ బోధించారు పార్టీ నిర్మాణం, నిబంధనావళి అనే అంశంపై పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ బోధించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి భవిష్యత్ కర్తవ్యాలు అనే అంశంపై సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు బోధించారు. కార్మిక నాయకులు కె. రామకృష్ణ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఉమా అభ్యుదయ గీతాలను ఆలపించారు

గిరిజన యువకుడిపై దాడి అమానుషం

కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-గుంటూరు: ప్రకాశం జిల్లా ఒంగోలులో గిరిజన యువకుడు మోట నవీన్‌ను అగ్రవర్ణ యువకులు దారుణంగా చితకబాది... మూత్రం పోసిన సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బా రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు అండగా ఉన్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెబుతు న్నాయని, కానీ ఇలాంటి దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా ఖండించకపోవడం దారుణమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. గిరిజన యువకుడిపై జరిగిన అమానుష ఘటనను నిందితులే వీడియో తీయడం, అది వైరల్ కావడంతో అసలు విషయం బయటపడిందని తెలిపారు. మీడియాలో కథనాల తర్వాతే పోలీసు, ప్రభుత్వం స్పందించడం దుర్మార్గ మని పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు లేకపోవడంతో ఇలాంటి దారుణాలు పునరావృతమవు తున్నాయని తెలిపారు. మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారానికి పాల్పడటం దుర్మార్గమని కరవది సుబ్బారావు వ్యాఖ్యానించారు.

గుండ్లకమ్మకు నిధులేవీ?

ఎమ్మెల్యే సుధాకరబాబు వ్యాఖ్యలు సరికాదు

రైతు సదస్సులో కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-మద్దిపాడు: గుండ్లకమ్మ జలాశయంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయించలేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే సుధాకర్‌బాబు సైతం ప్రాజెక్టు నిర్మాణంపై కనీసం శ్రద్ధ తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుకు నిధులు తీసుకురాలేని ఎమ్మెల్యే సుధాకర్‌బాబు...ప్రతిపక్షాలపై విమర్శలకు మాత్రం ముందు వరుసలో ఉంటున్నారని ఆరోపించారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయాన్ని రైతుసంఘం బృందం గురువారం సందర్శించింది. అనంతరం శ్రీ వెంకటేశ్వర అన్నదాన సత్రంలో రైతు సదస్సు జరిగింది. రైతుసంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటు తుప్పుపట్టి ఊడిపోవడంతో నీరు సముద్రం పాలైందని, దీంతో జలాశయంలో నీటిమట్టం తగ్గిపోయిందని కేవీవీ ప్రసాద్ చెప్పారు. జలాశయం పూర్తి నీటిసామర్థ్యం 3.78 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.6 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉందన్నారు. అధికారులు, ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని విమర్శించారు. గేట్ల నిర్మాణానికి కాంట్రాక్టరుకు నిధులు ఇవ్వకపోవడంతో ఆ పని నిలిచిపోయిందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు సరైన నివేదికను ప్రభుత్వానికి పంపి...నిధులు

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, గేట్ల మరమ్మతులు చేపట్టి ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని కోరారు. తెలంగాణ తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు పదివేలు సాగు సాయం రాబట్టేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ జలాశయం పట్ల నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సుధాకర బాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ గుండ్లకమ్మ జలాశయాన్ని సత్వరమే పూర్తిచేయకపోతే రానున్న రోజుల్లో రైతులు, ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. ఎస్కేయం జిల్లా కన్వీనర్ చుండు రంగారావు మాట్లాడుతూ బడ్జెట్‌లోనే ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ప్రాజెక్టుల నిర్వహణ సక్రమంగా, సకాలంలో సాగుతుందని సూచించారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ప్రభుత్వంలోనూ, అధికారులలోనూ మార్పు రాకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రైతు సంఘాల నాయకులు వెంకట్రావు, ఎస్.లలిత కుమారి, డి.శ్రీను, కె.వీరారెడ్డి, నారిపెద్ది వరహాల చౌదరి, రావి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అందించాలని, వెలుగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, మోటార్లకు మీటర్ల బిగించే ఆలోచన విరమించుకోవాలని, 60 ఏళ్లు పైబడిన రైతుకు, కౌలు రైతుకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, రైతు, కౌలు రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణాలు రద్దు చేయాలన్న తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

అనంతరం గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నారిపెద్ది వరహాలచౌదరి (మల్లవరం), ప్రధాన కార్యదర్శిగా వడ్డే హనుమారెడ్డి(కరువది), ఉపాధ్యక్షుడిగా కొన్నునేని నాగార్జున (పమిడిపాడు), సహాయ కార్యదర్శిగా చెరుకూరి వాసు (నాగుల ప్పలపాడు), ఎర్రం వెంకట శేషయ్యతో పాటు పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రైతు సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు, బదిలీలు పొందిన దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగంని వారు గురువారం కలిసి అనేక సమస్యలపై చర్చించారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందినటువంటి దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనాలు చెల్లించేందుకు సవరించిన కేడర్ స్ట్రెంత్ (రివైజ్డ్ కేడర్ స్ట్రెంత్) వివరాలు తక్షణం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఖజానా అధికారులకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. 679 మండల విద్యాధికారులకు తక్షణం జీతాలు చెల్లించడానికి అవసరమయ్యే పొజిషన్ ఐడి సృష్టించాలనీ, అవసరమైన చోట వారికి కూడా డ్రాయింగ్ అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బదిలీ అయి రిలీవర్ లేక ఉన్న ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తక్షణం రిలీవ్ చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు ఆమోదింపజేసి వారికి కూడా పదోన్నతులు ,బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. గత సంవత్సర కాలంగా పెండింగ్ ఉన్న సంపాదిత సెలవు నగదీకరణ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులలో జీవో నంబర్ 145ను సవరించాలని ఒక సబ్జెక్టులో అయిష్టత ప్రకటిస్తే రెండవ సబ్జెక్టులో అనుమతి ఇవ్వాలని కోరారు.

వైద్య విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదు: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: ధనార్జనే ధ్యేయంగా రోజు రోజుకు దిగజారుతున్న రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్‌బాబులు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల భర్తీలో విద్యా వ్యాపారానికి తెర లేపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ద్వారా వేల కోట్లు ఖర్చు చేసి వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నానని ఆర్భాటంగా ప్రకటించుకుని నేడు వైద్య కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన 107,108 జీఓల ద్వారా ఈ విషయం తేటతెల్లమవుతుందన్నారు. మూడు కేటగిరిలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కేటగిరీలకు కేటాయించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. 25 శాతం మాత్రమే రిజర్వేషన్ సీట్లను కేటాయించడం సరికాదన్నారు. తెలంగాణలో నూతన కళాశాలలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో కన్వీనర్ కోటాలోనే సీట్లు భర్తీ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గమనంలోకి తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. సీఎం రాష్ట్రంలో విద్యలో విప్లావాత్మకమైన మార్పులు చేస్తున్నామని పదేపదే చెబుతున్నారని, విప్లవాత్మక మార్పులు అంటే బలహీన వర్గాల ప్రజలకు ఉన్నత విద్య దూరం చేయడమేనా అని నిలదీశారు. రాష్ట్రంలో డబ్బు ఉన్నవాడికి పేద వాడికి మధ్య పోటీ జరుగుతుందని సీఎం జగన్ పదేపదే చెప్తున్నారని మెడికల్ సీట్ల కేటాయింపుతో ముఖ్యమంత్రి పేదల పక్షపాతి కాదు కార్పొరేట్ల పక్షపాతి అని ప్రజలకు అర్థమైందన్నారు. వెంటనే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య చేరువయ్యే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వైద్య విద్య సీట్ల అమ్మకం దారుణం

జాన్సన్‌బాబు, శివారెడ్డి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను 50 శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.జాన్సన్ బాబు, కె.శివారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగన్ సర్కార్ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్నారై కోటాలకు కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు వైద్య విద్యకి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం జగన్...వైద్యవిద్య ఫీజు ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలని, ఒకే కోటాలో సీట్లు ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమానికి సిద్ధమవు తామని, ప్రభుత్వం దిగిరాకుంటే న్యాయ పోరాటానికి వెనుకాడబోమని జాన్సన్‌బాబు, శివారెడ్డి హెచ్చరించారు.

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయాలి

అక్కినేని వనజ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం: ప్రజా వ్యతిరేక విధానాలు అనుస రిస్తున్న మోదీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపేందుకు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 6 వరకు సీపీఐ అధ్వర్యంలో బస్సుయాత్ర చేపడుతున్నట్లు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని గద్దె దింపడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్నారు. విపక్ష కూటమికి ఇండియా అనే పేరు పెట్టారని, దీనికి అందరూ మద్దతివ్వాలని ఆమె కోరారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడంపై అక్కినేని వనజ మండిపడ్డారు. ఇలాంటి ఘటనలతో దేశం సిగ్గుపడుతోందని అన్నారు. పోలవరం నిర్మాణానికి నిధులు అడిగే ధైర్యం ముఖ్యమంత్రి జగన్‌కు లేదని వనజ ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధిపై సీఎంకు ఆసక్తి లేదన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం మోదీ సర్కారు ఉమ్మడి పౌరస్మృతిని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న కులాలతో కూడిన భారత్‌లో ఉమ్మడి పౌరస్మృతికి స్థానం లేదని ఆమె స్పష్టంచేశారు. మణిపూర్‌లో ఇంకా హింస కొనసాగడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వెళ్లిన మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అనీరాజా, మరో ఇద్దరిపై దేశద్రోహం కేసు నమోదు చేయడం దారుణమన్నారు. దీనిపై ఈ నెల 25న దేశవ్యాప్తంగా సంఘీభావ సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రత్యేక హోదా, కడప స్టీల్‌ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్ వంటి విభజన హామీలను మోదీ సర్కారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మోదీ సర్కారుకు ఓటే వేస్తే దేశానికి ద్రోహం చేసినట్లేనని అక్కినేని వనజ అన్నారు. జగన్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. దళితులు, గిరిజన, మైనార్టీల హక్కులు హరించుకుపోతున్నాయన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పు రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతలపూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అవయవాలదానం ద్వారా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన దినేశ్

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ(అర్బన్) విద్యాధరపురంకు చెందిన వుజ్జురి దినేష్(22) బైక్‌పైన ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదానికి గురైయాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం తగలటంతో స్థానికులు, కుటుంబ సభ్యులు దినేష్‌ను అంబులెన్సు ద్వారా మణిపాల్ హాస్పిటల్ తరలించారు. దినేష్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా వైద్యులు అతనికి వెంటనే క్రేనియోటమీ శస్త్రచికిత్సను నిర్వహించారు. అయినప్పటికీ తన ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. వైద్య పరీక్షలు అనంతరం బ్రెయిన్ డెత్‌గా పరిగణించారు. క్షతగాత్రుడి భార్య వసంత, తండ్రి ఏడుకొండలు, తల్లి సుశీలలు అంగీకారం మేరకు ఆంధ్రప్రదేశ్ జీవన్‌ధాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటేపూడి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. దీనిలో కాలేయం, ఒక కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమైన వారికీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించారు, కళ్ళను ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, లంగ్స్ కిమ్స్, సికింద్రాబాద్, ఒక కిడ్నీ విజయ హాస్పిటల్ విజయవాడకి తరలించారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ కృతజ్ఞతలు తెలిపింది.

25న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

విద్యార్థి సంఘాల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించటం పట్ల ఈ నెల 25న విద్యా సంస్థల బందును జయ ప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్ బాబు, విద్యార్థి సంఘాల ఇతర నాయకులు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో దాసరి భవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్జి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య వక్తగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి జాన్సన్ బాబు పాల్గొన్నారు. ముందుగా జాన్సన్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18 తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్ ఇతర అధికారుల కార్యాలయాల వద్ద విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టగా, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎక్కడికక్కడే, అన్ని జిల్లాలలో, విద్యార్థి సంఘాల నాయకులపై నిర్బంధాన్ని, అరెస్టులను చేయటం దుర్మార్గమన్నారు. సమస్యలపై ప్రశ్నించే గొంతుకులపై గొంతు నొక్కటం, ప్రాథమిక హక్కులకు బంగం కల్పించటమేనన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఎ, పిడిఎస్యు, వామపక్ష ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ప్రతినిధులు కూలంకుషంగా చర్చించారు. పీడీఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ రాజేష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మిస్ చార్జీలు ఇవ్వాలని, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. 3,4,5 తరగతుల విలీన ప్రక్రియ 9605 పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయని తెలిపారు. పాఠశాల విలీన ప్రక్రియను నిలుపుదల చేసి, పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న పాఠ్యపుస్తకాలను ఇవ్వాలని కోరారు. హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్, ట్యూటర్, వాచ్ మెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఐ ఎస్ ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి అనిల్ కుమార్ మాట్లాడుతూ బాలికల హాస్టల్లో రక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు తినే ఆహారంలోకి సన్న బియ్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం యధావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందించాలని కోరారు. ఎస్ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ 25న విద్యాసంస్థల బందుకు పూర్తి మద్దతు ఉంటుందని ఫోన్ ద్వారా తెలియజేశారన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఈనెల 25న విద్యారంగ సంస్థల బందును నిర్వహించాలని తీర్మానించుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు, నగర కార్యదర్శి ఎం సాయికుమార్, సహాయ కార్యదర్శి చందు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అఖిల్, నగర అధ్యక్షుడు మహేష్ నగర ఉపాధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

అవినీతి, అరాచకం అంతానికి కృషి

యువతకు జంగాల పిలుపు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాజకీయాల్లో అవినీతి, అరాచకం, హింస అరికట్టేందుకు యువత నడుం బిగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సీఆర్ మోహన్ వర్ధంతి సభలో పాల్గొనటానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థను కాపాడు కోవడానికి యువత పాటుపడాలని, కుల, మత పీడన, ఆర్థిక దోపిడి లేని సామ్యవాద రాజ్య సాధనకు కమ్యూనిస్టు పార్టీ బాటలో ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయని విమర్శించారు. దేశసార్వభౌమత్వానికే ముప్పుగా పరిగణించే పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కమ్యూనిస్టులు మాత్రమే ప్రాణాలను త్వజించి పోరాటాలను చేసి ప్రజాస్వామ్య మనుగడను కాపాడతారని తెలిపారు. యువత విజ్ఞతతో వ్యవహరించి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అల్పపీడనం

మరో ఐదు రోజుల పాటు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు. దీన్ని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ పరిస్థితి మరో ఐదు రోజులపాటు కొనసాగుతుందని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎల్లో వార్నింగ్ ప్రకటించామన్నారు. అల్లూరి జిల్లా, మన్యం పార్వతిపురం జిల్లా లోని ఏజెన్సీ గ్రామాల్లో కుండపోత వర్షం కారణంగా రాకపోకలు స్తంభించిపోయాయి. ఇంకోపక్క రంపచోడవరం డివిజన్‌లో ఉన్న11 ముంపు మండలాల్లో, ఇంకా అనేక గిరిజన గ్రామాల్లో వరద ముంపు తీవ్రంగానే ఉంది. పోలవరం ముంపు గ్రామాల్లో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా గిరిజన జనజీవనం స్తంభించింది. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద హెచ్చరించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల వల్ల గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. ప్రభావిత జిల్లాల యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిసితిని అంచనా వేస్తున్నారు. ముందస్తుగా అల్లూరి జిల్లాకు ఎన్డీఆర్ఎఫ్, ఏలూరు జిల్లాకు రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. విపత్తుల నిర్వహణ సంస్థలో స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర సహాయం కోసం 24 గంటలు 1070, 18004250101 కంట్రోల్ రూమ్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. జిల్లాల్లో, మండల స్థాయిలో కూడా అధికారులు కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. బోట్లు, మోటర్ బోట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించడం చేయరాదన్నారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని ఏపీ విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు.

సంపాదకీయం

మణిపూర్‌పై పెదవి విప్పిన మోదీ

ప్రజాస్వామ్యం భారత్ నరనరాల్లో జీర్ణించుకు పోయింది అని దండోరావేస్తూ నాలుగు దేశాలలో పర్యటించడానికి ప్రధానమంత్రికి తీరిక దొరికింది. కానీ అగ్ని గుండంలా మారిన మణిపూర్ గురించి పెదవివిప్పడానికి మోదీకి 78రోజులు పట్టింది. అదీ యథాలాపంగా పార్లమెంటు సరసన విలేకరులతో పిచ్చాపాటీ మాట్లాడుతున్నప్పుడు మోదీ మణిపూర్ ప్రస్తావన తెచ్చారు. ఆ విషయంలో విపులమైన సమాచారం ఇవ్వలేదు. మణిపూర్ ప్రజలకు భరోసా కల్పించే ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మణిపూర్ వ్యవహారాన్ని ప్రధాన మంత్రి మోదీ ప్రస్తావించడం యథాలాపంగానే జరిగింది కనక అక్కడ కొనసాగుతున్న విచ్చలవిడి హింసాకాండ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. శాంతియుతంగా మెలగాలని కనీసం మణిపూర్ ప్రజలకు విజ్ఞప్తి అయినా చేయలేదు. మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైన మే మూడవ తేదీ మర్నాడు ఇద్దరు మహిళలను నగ్నంగా పరేడ్ చేయించి అత్యాచారం చేశారన్న సమాచారం బుధవారం అందింది. దానికి సంబంధించిన వీడియో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఆ తరవాతే మోదీ ఇది భయంకరమైన సంఘటన అన్నారు. దోషులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మెజారిటీ వర్గమైన మెయితీలను కూడా గిరిజనులుగా పరిగణించాలని కోరడంతో అగ్గి అంటుకుంది. ఈ వాదనకు బీజేపీ అండ ఉంది. మణిపూర్ లో గిరిజనులైన కుకీల మీద దాడులు జరుగుతున్నా మోదీ కానీ, బీజేపీకానీ నోరు విప్పలేదు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే మెరుగైన పరిస్థితి ఉంటుందన్న బీజేపీ నిరంతర ప్రచారంలోని డొల్లతనం మణిపూర్‌లో బాహాటంగా రుజువైంది. దీని గురించి మోదీ ప్రస్తావించనే లేదు. మణిపూర్ హింసాకాండ శూన్యంలో జరుగుతోందని నమ్మించే ప్రయత్నం జరుగుతోంది. ఉదాహరణ ప్రాయంగా పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. షరా మామూలుగా గుర్తు తెలియని వారిపై ఎఫ్.ఐ.ఆర్.లు నమోదు అవుతూనే ఉన్నాయి. మణిపూర్‌లో మహిళలమీద అత్యాచారాన్ని ఖండించిన మోదీ తన కుట్రపూరిత రాజకీయ వైఖరిని మాత్రం వదలలేదు. మణిపూర్ సంఘటన తనను విచలితుణ్ని చేసింది అని చెప్తూనే మన తల్లులను, చెల్లెళ్లను కాపాడుకోవలసిన అవసరం ఉందంటూనే కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ ప్రస్తావన అవసరం లేకుండానే తీసుకొచ్చారు. మహిళల మీద అత్యాచారాలు జరిగిన బీజేపీ పాలితరాష్ట్రాల ప్రస్తావన ఆయన పొరపాటున కూడా తీసుకు రాలేదు. ఆ సంఘటనలన్నింటినీ చాకచక్యంగా చాప కిందికి తోసేశారు. కథువా అత్యాచార సంఘటన, బిల్కిస్ బానోపై మూకుమ్మడి అత్యాచారం సంఘటనలు మోదీకి పొరపాటున కూడా గుర్తుకు రాలేదు. మణిపూర్ పరిస్థితిపై ప్రధానమంత్రి మౌనం పాటిస్తున్నందుకు అనేక విమర్శలు ఎదురైనాయి. మణిపూర్ సమస్యను పరిష్కరించడం మీకు చేతకాకపోతే మేమే సమస్యను తీసుకుని పరిష్కారం చేస్తామని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని హెచ్చరించింది.ఇప్పటికైనా మోదీ కదులుతారేమో చూడాలి. మణిపూర్ పరిస్థితిపై పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. మొదట ప్రధానమంత్రి మణిపూర్ పరిస్థితిపై ప్రకటన చేస్తే ఆ తరవాత చర్చించవచ్చునని ప్రతిపక్షాలు అంటున్నాయి.

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అల్లర్లను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. హింసాకాండ మొదలైనప్పుడు బీరేన్ సింగ్ చేసిన ప్రకటనల్లో జాతుల గొడవ లేనే లేదు అన్నారు. ఈ అల్లర్లకు "తీవ్రవాదులు", "చొరబాటుదార్లు" కారణం అని చెప్పారు. తనను విమర్శిస్తున్న వారిని మైన్మార్ నుంచి వచ్చిన కుకీలు అన్నారు. పరిస్థితిని చక్కదిద్దాలని బీజేపీ మిత్రపక్షాలు కూడా కోరినా పరిస్థితిలో మార్పులేదు. బీజేపీ వారి గురించి మోదీ ప్రస్తావించనే లేదు. అల్లర్లు ప్రారంభమైన వెంటనే ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయం లేకుండాచేసింది. ఇలా చేయడం బీజేపీ ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. సామాజిక మాధ్యమాలు విచ్ఛిన్నకరమైన పాత్ర పోషించకుండా చేయడానికి ఇంటర్నెట్ లేకుండా చేస్తున్నా దానివల్ల మేలు కన్నా కీడే ఎక్కువ జరుతోంది. హింసాకాండను అదుపు చేయలేని ప్రతి సందర్భంలోనూ ఇంటర్నెట్‌ను అదుపు చేస్తున్నారు. ఇంటర్నెట్ సదుపాయం ఉండి ఉంటే ఇద్దరు మహిళల మీద అత్యాచార సమాచారం వెంటనే అందేదేమో. పైగా ఈ అత్యాచారానికి సంబంధించిన వీడియోలను ప్రసారంచేసినందుకు ట్విట్టర్‌మీద చర్య తీసుకోవాలనుకోవడం ఆడలేక మద్దెలఓడు అన్నట్టే ఉంది. ఇంటర్నెట్ సదుపాయం లేనందు వల్ల వాస్తవ సమాచారం కూడా బయటకు రావడం లేదు. సరైన సమాచారం అందనప్పుడు వదంతులు రాజ్యమేలుతాయి. వాస్తవం చెప్పడానికి ప్రయత్నించిన వారిమీద పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల మణిపూర్‌లో పర్యటించి వచ్చిన నిజనిర్ధారణకమిటీ "ఇది ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగుతున్న హింసాకాండ" అన్నందుకు వారి మీద పోలీసులు చర్య తీసుకుంటున్నారు. తరచుగా ఇంటర్నెట్ సదుపాయం తొలగించడంలో భారత్ అగ్రస్థానంలో ఉందని ఇటీవలే జి20 సమావేశాల్లో కూడా విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. వాస్తవాలు రాసే పత్రికా రచయితలను జైళ్లలో పెట్టడం ఈ ప్రభుత్వానికి కొత్తేమీ కాదు. కశ్మీర్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. మణిపూర్‌లో మహిళలమీద అత్యాచార వీడియో బయటకు రాకుండా ఉంటే ప్రధానమంత్రి ప్రస్తావించే వారా? అసలు ఈ కేసులో చర్య తీసుకోవడం సాధ్యమయ్యేదా? మణిపూర్ లో లైంగిక అత్యాచారం గురించి తప్ప మరే అంశాన్నీ మోదీ ప్రస్తావించలేదు. అత్యాచారాలు జరగడం ఇది మొదటిసారికాదు. ఇలాంటి సంఘటనలు కనీసం ఆరు జరిగాయి. మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడానికి ప్రయత్నించడం మానేసి సమాచారప్రసారాన్ని అదుపుచేయాలనుకోవడం పిచ్చిపని. సమాచారాన్ని అడ్డుకోవడంవల్ల ఒక్క సమస్యా అయినా పరిష్కారం అయిన దాఖలా లేదు. దీనివల్ల జరిగేదల్లా పాలనావిభాగం అతిగా ప్రవర్తించడానికి మాత్రం అవకాశంకలుగుతుంది. ఇంటర్నెట్ లేకుండా చేయడంవల్ల తప్పుడు సమాచారం వ్యాపించ కుండా ఒకటి రెండురోజులు అదుపు చేయవచ్చునేమో. కానీ అసలైన సమాచారం అందకుండా పోతుంది. మణిపూర్ ప్రభుత్వం ప్రజా స్వామ్య పద్ధతులను అనుసరించడమే లేదు. ప్రజల మీద యుద్ధం చేస్తున్నట్టుగా ఉంది. ప్రస్తుత సమస్యను పరిష్కరించే ఉద్దేశం మణిపూర్ ప్రభుత్వానికి ఉన్నట్టు లేదు. అంటే మోదీ, అమిత్ షా ద్వయానికీ లేనట్టే.

సమాచారాన్ని అడ్డుకోవడం హింసాకాండను అణచడానికి ఉపకరించదు కానీ ప్రభుత్వ యంత్రాంగం తమ అకృత్యాలను కప్పి పుచ్చడానికి కచ్చితంగా తోడ్పడుతుంది. మణిపూర్ లో ఏం జరుగుతోందో ప్రపంచానికి తెలిస్తేనే రాజకీయ పరిష్కారం కుదరడం వీలవుతుంది. కానీ బీజేపీ ఈ పరిస్థితి ఆసరగా కుటిల రాజకీయాలు చేస్తోంది. మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారికి మరణ దండన విధించే ఆలోచన చేస్తున్నామని అక్కడి ప్రభుత్వం అంటోంది. కానీ కఠినశిక్షలు నేరాలని, ఘోరాలను తగ్గించిన ఆనవాళ్లు ఎక్కడాలేవు. మణిపూర్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో విఫలం అయితే కేంద్ర ప్రభుత్వం రాజకీయ పరిష్కారం కనుగొనడంపై దృష్టే పెట్టడం లేదు. ఈ రెండు వైఫల్యాలలోనూ బీజేపీకి స్వార్థ ప్రయోజనాలున్నాయి.

చంద్రుడిపై నివాసాలు..!

రావా చందమామ వినరావా మా కథ, వింటె మనసు వుంటె చేరనీవా నీ దరి మామా చందమామ, నువు వూ అంటే క్యా కట్టమా మామా చందమామ. అబ్బో ఏంటిబావ ఏకంగా చంద్రమండలానికి నిచ్చెన వేస్తున్నావు, ఏంటా కథ నాక్కూడా కొంచెం చెప్పవయ్యా. చెప్పేదేమీ లేదయ్యా. నువు బట్టలు సర్దుకొని రడీగా ఉండు.

ఏంటయ్యా అంతఅర్జెంటా అంతె. మరి మనది ప్రజాప్రభుత్వం పేరిట చెలామణి అవుతున్న పెట్టుబడిదారీ ప్రభుత్వం. నిన్ను నన్ను పక్కకు తోసేసి ఆదాని లాంటివారు ముందెళ్లి ఆక్రమించుకుని మన లాంటి వారికి అమ్మకాలుచేస్తారు. సరెలేవయ్యా అసలు చంద్రయాన్-3 ద్వారా మన శాస్త్రజ్ఞులు సాధించిన విజయం అసామాన్యమైనది. రెండుసార్లు విఫలమైనా మూడోసారి సాధించిన ఈ విజయం ద్వారా ప్రపంచాన్ని నివ్వెరపోయేట్లు చేసి మన దేశానికి ఘనమైన ఖ్యాతి సాధించింది. నిజమె యిప్పటికె అక్కడ నీరుందని రుజువు చేసింది. ఇప్పుడు చంద్రునిపైన ఆగస్టు 23న లాండ్ అవుతుంది. ప్రపంచంలో ఏ దేశమూ చేయలేనిపని మన శాస్త్రవేత్తలు సాధించడంతో దేశ మంతా సంబరాలు చేసుకుంటోంది. మనకంటె ముందు చైనా, రష్యా, అమెరికా ప్రయత్నించినా ఈ ఘనకార్యం సాధించలేదు. నిజంగా ఈరోజు మన శాస్త్రవేత్తల కృషివల్ల మన దేశ ప్రగతి ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. నిజమె అసలు అభివృద్ధి అనేది శాస్త్రవేత్తల వలనె జరుగుతుంది. ఆకులు కట్టుకుని, కనబడిన పుట్టకు, చెట్టుకు మొక్కిననాటినుండి యింతవిజయం సాధించేదశకు చేరిన మానవప్రగతి సామాన్యమైందికాదు. అది సరె బావ యింత విజయానికి కారకుడైన శాస్త్రవేత్త విజయంకోసం తిరుమల వెళ్లి మొక్కడం చూస్తె యింకా మనిషి పరాధీనుడేనా అనిపిస్తోంది. ఎంత సైన్సు అభివృద్ధిచెందినా అందుకుకారకుడైన శాస్త్రవేత్త తాను నిమిత్త మాత్రుడనని, అంతా దైవ సంకల్పమని భావించడంలో ఔచిత్యం నాకు అవగతం కావడంలేదు. ఇందులో అర్థం కానిదే ముంది. ఇంకా ఈ విశ్వంలో తనకుతెలియనిది చాలాఉంది అని తెలుసుకొనే ప్రయత్నానికి కనిపించనిశక్తి సహాయం కావాలను కుంటున్నాడు.

ఈ ప్రకృతిలో మనిషి పుట్టుకకు ముందె భూమి, ఆకాశం, అడవులు అన్నీ ఏర్పడి ఉన్నాయి. వాటిని మనకు కనిపించని దైవం ఏర్పాటు చేశాడని ఈనాటికి నమ్మే వారే ఎక్కువ. శాస్త్రవేత్తలు అవన్నీ పరిణామ క్రమంలో ఏర్పడినవని తెలిసినా ఎందుకైనా మంచిది మనకు కావలసింది విజయం. దానికోసం అదృశ్య శక్తికి మొక్కడం తప్పులేదని మొక్కుతున్నారని అనుకుంటాను. అది సరె విజయం చేకూరిన తరువాత ఆ క్రెడిట్ భగవంతుని ఖాతాలో వేయడం నా మనసు అంగీకరించడం లేదు. సర్వ శక్తులు ఉపయోగించి నిద్రాహారాలు లేకుండ కష్టపడి ఫలితంకోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసి దేవుడి దయవల్ల విజయం సాధించామనడం బాధగా ఉంది. ఇందులో నువు బాధపడాల్సిందే ముంది. అంత తేలికగా మాట్లాడకు. దేశ అధ్యక్షుడు, దేశ ప్రధాని దగ్గర నుండి ప్రతి ప్రజానాయకుడు తిరుమల వెళ్లి హుండీలో కానుకలు చెల్లించి గుడిచుట్టు తిరుగుతుంటె సామాన్యుడు అంతటి గొప్పవారె వెళ్లి మొక్కితే తాను వెళ్లకపోవడం తప్పుగా భావించి అప్పుచేసి తిరుమల వెడుతున్నాడు. అనుకోకుండా పరోక్షంగా వారి వల్ల ప్రజల్లో దైవారాధన పెరుగుతోంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కూడ వెడితె తెల్లవారేసరికి వార్తాపత్రికలలో వారి ఫొటోలు రావడంతో తెలిసో తెలియకో నాయకులు, న్యాయమూర్తులు దైవారాధన వల్ల అన్యాపదేశంగా ప్రోత్సహించినట్లవుతోంది. ఇందు కలడందులేడన్న ప్రహ్లాదుడు దగ్గర నుండి ప్రతి అణువణువునా భగవంతుడున్నాడని ప్రస్తుత ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నా దైవారాధన ఇంటికి పరిమితం చేయకపోవడంతో పరోక్షంగా ప్రజల్లో పెంచిన వారవుతున్నారు. దాంతో ఎంతో ట్రాఫిక్ ఉన్న రోడ్లపై కూడ గుడులు వెలిసి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అసలు నమ్మకం సైన్సుకు బద్ధవిరోధి. ఆ నమ్మకాలు, మూఢ నమ్మకాలుగా మారితె సాధించిన ప్రగతి నిర్వీర్యమై పోతుంది. ఎప్పటికైనా చంద్రునిపై నివాసం సాధ్యపడవచ్చు.

సెల్: 9885569394

రజక వృత్తిదారుల దుర్భర జీవితాలు

కె. రామాంజనేయులు

మన సమాజంలో పనివిభజన జరిగిన నాటి నుండి తరతరాలుగా బట్టలు ఉతుకుతూ సమాజాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచేందుకు నిరంతరం శ్రమపడేది రజకులే. భారతీయ కులవ్యవస్థలో అంటరానితనాన్ని ఎదుర్కొంటూ గ్రామానికి దూరంగా నివాసం ఉన్న దళితులను కూడా అక్కున చేర్చుకుని వారి బట్టలను ఉతికే గొప్ప మానవతావాదులు రజకులు. మనిషి పుట్టుక నుండి మరణం వరకు శుభ, అశుభ కార్యాల్లో సేవలందిస్తూ, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థీకృతం చేసిన మనువాద బ్రాహ్మణ ఆధిపత్య సమాజంలో రజకుల సేవలను పొందుతూనే రజకులను చీదరించుకునే బ్రాహ్మణ భావజాలం వేళ్ళూనుకొని ఉన్నట్టు మన సమాజంలో అగ్రవర్ణ, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు కూడా బ్రాహ్మణ భావజాలంలో కూరుకొనిపోయి రజకుల వృత్తిని చిన్నచూపు చూస్తున్న ఫలితంగా రజకులు నిత్యం అవమానాలకు, కుల వివక్షతకు, వేధింపులకు, లైంగిక దాడులకు, దౌర్జన్యాలకు గురవుతూ సాంఘిక బహిష్కరణకు గురవుతున్నారు. సొంత భూమిలేని రజకులు కేవలం శారీరక శ్రమకు మాత్రమే పరిమితమై వృత్తిని కొనసాగిస్తున్న రజకులు అక్షరాస్యతకు దూరమై అభివృద్ధికి ఆమడ దూరంలో జీవిస్తున్నారు. రజక వృత్తిదారులు తమవృత్తిని కొనసాగిస్తూ గ్రామాలలో, పట్టణ ప్రాంతాల్లో బట్టలు ఉతికి సేవలందించేందుకు అవసరమైన నీరు, దోబీఘాట్‌లు, విద్యుత్తు సౌకర్యం లేక అరకొర సౌకర్యాలతో వృత్తిని కొనసాగిస్తున్నారు. ప్రకృతిపరంగా బట్టలు ఉతికేందుకు నీటి సౌకర్యం లేని వేసవికాలంలో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కానీ స్థానిక ప్రజా ప్రతినిధులు పూనుకోకపోగా, సకాలంలో తమ బట్టలు ఉతకలేదని ఆగ్రహంతో గ్రామీణ అగ్రవర్ణాలకు చెందిన పలుకుబడి కలిగిన పెత్తందార్లు కన్నెర్రచేసి రజకులపై నిర్ధాక్షణ్యంగా దాడులకు పాల్పడు తున్నారు. ఆవేదనలో వ్యతిరేకించిన రజకులను గ్రామాల్లో సాంఘిక బహిష్కరణ చేస్తున్నారు. అవమానాలతో అక్కడ బతకలేక రజకులు గ్రామాలు వదలి పట్టణాలకు వలసవెళ్ళినా పట్టణాల్లో కూడా అద్దె ఇళ్లలో, అపార్టు మెంట్లలో పనిచేసి అక్కడే నివాసం ఉంటూ అరకొర జీతాలతో జీవితాలను గడుపుతున్నారు. రజకులకు సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి అనేక వాగ్దానాలు చేయడం, వచ్చినతర్వాత వాటిని విస్మరించడం 76 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో జరుగుతున్న తంతే. వీరిని కేవలం ఓటర్లు గానే పరిగణించి పబ్బం గడుపుకుంటున్నారు.

పురాతనకాలం నుండి బట్టలు ఉతికేందుకు చౌడును ఉపయోగిస్తున్నారు. మురికి వదలడానికి చౌడుతో నానబెట్టి ఉడకపెట్టడం, ఉతకడం కనుగొన్నది మొట్ట మొదటి సైంటిస్టులు రజకులే అని చెప్పవచ్చు. పారిశ్రామిక విప్లవం అనంతరం డిటర్జెంట్ సబ్బులు, వాషింగ్ పౌడర్లు, వాషింగ్ మిషన్‌లు వాడుకలోకి వచ్చాయి. రజకులను ఆదుకునేందుకు వారికి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి. నిరంతరం ఆకాశాన్నంటుతున్న ధరల పెరుగుదలతో ముడి సరుకులను కొనుగోలు చేయడంలో ప్రభుత్వాల ప్రోత్సాహం చాలా తక్కువగా ఉంది. గతంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా 50శాతం సబ్సిడీ రుణాలు అందజేసి రజక వృత్తిదారులను కొంతమేరకైనా ఆదుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగులకంతా పెద్దపీట వేస్తున్నానని ఎంతో ఆర్భాటంగా 56 కులవృత్తుల కార్పొరేషన్లను ఏర్పాటుచేసి, నిధులు కేటాయించకుండా చేతివృత్తులను ఆదుకోవడంలో ఘోరంగావిఫలమై వాటి కాలపరిమితి ముగిసిపోయింది. లాభసాటిగా భావిస్తున్న డబ్బున్న కార్పొరేట్ సంపన్నులు రజకవృత్తిలోకి ప్రవేశించే నగరాల్లో, పట్టణాల్లో ఆకర్షణీయమైన డ్రై క్లీనింగ్ షాప్‌లు పెట్టి, ఈ వృత్తిని కూడా కబళించి తరతరాలుగా తమ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకుల వృత్తిని కూడా దెబ్బతీస్తున్నారు.

మరొకవైపు రజకుల సామాజిక ఎదుగుదలపై కూడా ఈర్ష్యతో ఇటీవల కాలంలో రజకులపై దాడులు జరుగుతున్నాయి. విశాఖ మహానగరంలో ఒక అపార్ట్‌మెంట్‌లో రజక యువతిపై వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడగా అపార్ట్‌మెంట్ పైనుండి దూకి ఆ యువతి ఆత్మహత్య చేసుకొని మరణించింది. కర్నూలు జిల్లాలో వెల్దుర్తి మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో వైసీపీ నాయకుల మధ్య జరిగినపోరులో తమ ఓటమికి రజకులే కారణమని నిర్ధాక్షిణ్యంగా పొలానికి వెళుతున్న రజకులను అడ్డగించి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పరి మండలంలోని కారుమంచి గ్రామంలో రజకుడు సర్పంచ్ గా ఎన్నికైనారని ఓర్వలేక మొహరం పండుగ సందర్భంగా అతనిపై పెట్రోల్ పోసి అంటించి తీవ్రంగా గాయపరిచారు. గుంటూరు జిల్లాలో రజకుడు సర్పంచిగా ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తుండగా ఓర్వలేని అగ్ర కులదురహంకారులు దాడిచేసి గాయపరిచారు. చిలకలూరిపేట సమీపం లోని గ్రామంలో ఊరిమధ్యలో వితంతురాలైన రజకయువతి తన ఆడపిల్లలను పోషించుకునేందుకు జీవనాధారంగా హొటల్ పెట్టుకొని జీవిస్తుండగా స్థానిక అధికార పార్టీ నాయకుడు బలవంతంగా హోటల్‌ను ఖాళీచేయించి స్థలాన్ని కబ్జాచేసి రియల్‌ఎస్టేట్‌వ్యాపారం చేసుకునేందుకు ఆ యువతిని బెదిరించాడు. స్థానికప్రజలు, ప్రజాసంఘాలు అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించాడు.

భూములకు విలువ పెరగడంతో రజక వృత్తిదారులు బట్టలు ఉతకడానికి కేటాయించిన దోబీ ఘాట్ల స్థలాలను, చాకిరేవులను కూడా అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రామాల్లో భూకబ్జాలకు పాల్పడుతున్నారు. నంద్యాల జిల్లా ఆలమూరు గ్రామంలో రజకులు ఎన్నో సంవత్సరాలుగా బట్టలు ఉతకడానికి ఉన్న ప్రభుత్వ స్థలంలో న్యాయంగా రజకులు బోరు వేసుకుని మోటార్ కూడా బిగించుకుని బట్టలు ఉతికి వృత్తిని కొనసాగిస్తుండగా, అధికార పార్టీ నాయకుడు దౌర్జన్యంగా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని బోరును కూడా సొంత భూమికి నీటిని పారించుకొని రజకులను వెళ్లగొట్టారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.. రాష్ట్రంలో అనేకచోట్ల దోబీఘాట్‌లు లేవు. దోబీఘాట్‌లు ఉంటే బోరు, నీరు, విద్యుత్తు ఉండదు. వాటికి మరమ్మతులు చేసే పరిస్థితి ఉండదు. అనేక గ్రామాల్లో రజక వృత్తిదారులకు కేటాయించిన ఇనాం భూములను కూడా గ్రామాల్లో పెత్తందార్లు గ్రామస్తులను రెచ్చగొట్టి వాటిని స్వాధీనం చేసుకొని రజకులను వృత్తి చేయకుండా వెళ్లగొట్టడం జరుగుతున్నది. ఇలాంటి సంఘటనలపై చర్యలు తీసుకోవాల్సిన రెవిన్యూ, పోలీసు అధికారులు గ్రామ పెత్తందార్లకే వత్తాసు పలికి సమస్యలను పరిష్కరించడం లేదు.

రజక వృత్తిదారుల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి కోసం సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న రజక వృత్తిదారుల జనాభా ప్రాతిపదికగా ప్రభుత్వంలో స్థానం కల్పించాలి. వృత్తి పరిరక్షణ సామాజిక భద్రత, సంక్షేమం లక్ష్యంగా తమ ఆత్మగౌరవం కాపాడుకోవడానికి రజకులు చైతన్యవంతులు కావాలి. ప్రధాన సమస్యల పరిష్కారం చేయాలి. వృత్తులను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు ప్రోత్సాహాలను, సబ్సిడీలను అందించాలి. ముడి సరుకుల ధరలను తగ్గించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగంలో ఉన్న అన్ని విభాగాల్లో దోబీ ఉద్యోగాలను రజకులకే కేటాయించాలి. దోబీఘాట్‌లను ప్రభుత్వమే ఏర్పాటుచేసి నీరు, విద్యుత్తు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఎల్.కె.జి నుండి ఉన్నత విద్య వరకు రజకుల పిల్లలకు పాఠశాలలో రిజర్వేషన్ కల్పించి ఉచితంగా విద్యను అందించాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు కేటాయించడంలో రజకులకే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. రజకుల కొరకు కేటాయించిన ఇనాం భూములను దోబీఘాట్‌ల స్థలాలను భూకబ్జాకాకుండా కాపాడాలి. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి. రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సామాజిక భద్రత చట్టాన్ని తీసుకొనివచ్చి రజకులకు రక్షణ కల్పించాలి. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క రజకునికి 5,000 వేల రూపాయలు వృద్ధాప్యపింఛన్ ఇవ్వాలని డిమాండ్‌చేస్తున్నాను. జూలై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు వేదికగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని, రజక వృత్తిదారులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సన్నద్ధమవుతున్నారు. సేవారంగంలో అమూల్యమైన సేవలందిస్తున్న రజకులకు అండగా అన్నివర్గాల ప్రజలు నిలవాలని ఆశిద్దాం.

ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు జింకా చలపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు పాల్గొంటారు.

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి
94401 46608

బీజేపీ ఎన్నికల స్టంట్ యూసీసీ

డాక్టర్ సీఎన్. క్షేత్రపాల్‌రెడ్డి

ముసాయిదా రూపొందని ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. ఇదేదో ఉన్నట్టుండి చర్చకు వచ్చిన అంశం కాదు. ఎంతో కాలంగా నలుగుతున్న విషయమే. జన సంఘ్ బీజేపీగా మారిన నేపథ్యంలో తమ మతతత్వ అజెండాలో యూసీసీని (ఉమ్మడి పౌరస్మృతి)ని చేర్చుకున్నారు. యూసీసీ వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం తదితర అంశాలకు సంబంధించి దేశంలోని అన్ని మతాల ప్రజలకు ఒకే రకమైన చట్టం ఉండాలన్నది పాలకుల ప్రతిపాదన. మతంతో సంబంధం లేకుండా, లింగ భేదాల్లేకుండా భారత పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలనేది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి చర్చకు వస్తూనే ఉంది.

తాజాగా ఉమ్మడి పౌరస్మృతి లేకనే దేశం వెనుకబడి పోయిందనే విష ప్రచారం కొనసాగుతోంది. ఉమ్మడి పౌర స్మృతిని స్థూలంగా గమనిస్తే దాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంది అనిపిస్తుంది. ఈ కారణం చేతనే పెళ్లిళ్లు, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తులు, పిల్లలను దత్తత తీసుకోవడం, జీవనభృతిలాంటి అనేక సామాజిక విషయాలకు సంబంధించిన చట్టాలు దేశంలో ఉన్న ముస్లింలకు మాత్రమే వేరుగా ఉన్నాయనేది అసత్యం. ముస్లింలతో పాటు హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులకు కూడా వ్యక్తిగత చట్టాలున్నాయి. క్రైస్తవులకు వారి సొంత చట్టాలు ఉన్నాయి. ఈ విషయం సామాజిక అవగాహన ఉన్న వారందరికీ తెలుసు. అయితే సంఘ్ పరివార్ మూకల వలలో పడిన విజ్ఞత లోపించిన వారే ముస్లింలకు మాత్రమే ప్రత్యేక చట్టాలున్నాయని నమ్ము తున్నారు. అమెరికా సహా ఐర్లాండ్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మలేషియా, టర్కీ, ఇండోనేషియా, సూడాన్, ఈజిప్ట్ వంటి అనేక దేశాల్లో యూసీసీ అమలవుతున్నా భారత్‌లో ఎందుకు లేదనే వితండవాదనకు దిగుతున్నారు.

2018 నాటి 21వ లా కమిషన్ నివేదికలో మహిళల విషయంలో కొనసాగుతున్న అసమానతలకు మూలం వివక్ష అని స్పష్టంగా పేర్కొంది. లింగ సమానత్వం గురించి లాకమిషన్ మాట్లాడితే....ఎన్నికల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రధాని మోదీ ఉమ్మడి పౌరస్మృతి అనే వివాదాస్పద అంశం చుట్టూ చర్చకు కేంద్ర బిందువయ్యారు. బీజేపీ విధివిధానాలను, నిజంగా బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 1996లో ఆ పార్టీ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో నారీ శక్తి విభాగంలో ఏమి పేర్కొన్నారో పరిశీలించాలి. లింగ సమానత్వం అనే అంశాన్ని బీజేపీ తమ నాటి ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. కులం, వర్ణ, వర్గాలకు అతీతంగా స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని పేర్కొంది. ముస్లిం దంపతులకు దత్తత హక్కులు లేనందున ఒక బిడ్డను దత్తత తీసుకోలేకపోతున్నారంటూ పెడబొబ్బలు కూడా పెట్టింది. దేశంలోని అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకు వివాహ వయస్సు 18 ఏళ్లుగా ఎందుకు ఉండరాదని, వారసత్వ చట్టంలో దేశంలోని మహిళలందరికీ సమానత్వం ఎందుకుండకూడదని ప్రశ్నించింది. 1998 ఎన్నికల ప్రణాళికలో ఇవే అంశాలను ప్రస్తావించింది. అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లలో మహిళా సాధికారత కోసం వేసిన అడుగులు లేక ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే

మహిళలపై వివక్షను రూపుమాపుతుందనే సత్యదూరపు వాదనను తెరపైకి తెస్తోంది. 2024 జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు, ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకున్న ప్రధాని మోదీ ఇటీవలే భోపాల్ నిర్వహించిన ఎన్నికల సభలో ఉద్దేశపూర్వకంగానే ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు. ఆ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తమకు దక్కని అధికారాన్ని అడ్డగోలుగా కొల్లగొట్టిన బీజేపీ పాలన సాగించింది. రానున్న ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఏమీ లేక దొరక్క సర్వసాధారణంగా వారు వాడే ఆయుధం మతతత్వంతో కూడిన ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రధాని నోటి వెంట యూసీసీ ప్రస్తావన వచ్చిందో లేదో వాట్సప్ యూనివర్సిటీ యంత్రాంగం, అంధ భక్తులు తాము యూసీసీకి అనుకూలం అనేలా ప్రత్యేక అసత్యాల కథనాలను వండి సోషల్ మీడియా వేదికలపై వార్చింది. మీరు అనుకూలమా కాదా చెప్పాలంటూ విధి విధానాలు కూడా రూపొందని, ముసాయిదా కూడా తయారు కాని అంశాన్ని పట్టుకుని చర్చలకు భారత ప్రజానీకాన్ని పురిగొల్పేందుకు నానా అగచాట్లు పడుతోంది.

ఇప్పటి వరకూ లా కమిషన్ ఇచ్చిన చాలా సిఫార్సులను అసలు పట్టించుకోని బీజేపీ యూసీసీపై మొండి వైఖరితో ముందుకెళ్లడానికి వారు నిత్యం అనుసరించే మతతత్వ రాజకీయాలే కారణం. ఎన్నికలేవైనా హిందు, ముస్లిం విభజన ద్వారా ఓట్లు పొందవచ్చునని చూస్తూనే ఉంటుంది. ఇటీవలే కన్నడ నాట జరిగిన ఎన్నికల్లో ఏకంగా ప్రధాని మోదీ కేరళ ఫైల్స్ అనే ఉన్మాద సినిమాను చూడాలని, జై భజరంగ్‌భళి అంటూ ఓట్లు వేయాలని కోరడమే ఇందుకు ఉదాహరణ. మత ప్రభావం అధికంగా ఉన్న కన్నడ ప్రజలే పూర్తిగా బీజేపీని తిరస్కరించారు. ఇక దేశాన్ని అమ్మకానికి పెట్టిన బీజేపీ వల్లించే దేశభక్తి నినాదాలను ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరు. రామమందిరం వివాదం సమసిపోయింది. ఆ పేరుతో మత విభజన సాధ్యం కాదు కాబట్టే తమ అమ్ముల పొదలోని చివరి ఆయుధం ఉమ్మడి పౌరస్మృతి తుట్టెను కదిపింది.

అంబేద్కర్ కూడా యూసీసీని కోరుకున్నాడని వాదించే వారు ఆయన హిందూ కోడ్ బిల్లు కోసం చేసిన పోరాటాన్ని ఎందుకు విస్మరిస్తున్నారో, హిందూ వర్గాలకు చెందిన మహిళా ప్రయోజనాలు దాగి ఉన్న హిందూ కోడ్ బిల్లును బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోందో బహిర్గతం చేయాలి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో చట్టం ఎందుకు చేయడం లేదో సమాధానం చెప్పాల్సి ఉంటుంది. దేశంలో ఇప్పటికి అమలులో ఉన్న హిందూ వివాహ చట్టం ఏకరీతిలో లేదు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతులు అమలవుతున్నాయి. హిందూ వివాహ చట్టం గోవాలోని హిందువులకు వర్తించదు. గోవాలో హిందూ పురుషుని భార్య 30 ఏళ్లలోపు మగ బిడ్డకు జన్మనివ్వకపోతే పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చు. ఇటువంటివి దేశ వ్యాప్తంగా అనేకం ఉన్నాయి. ఉత్తరాదిన మేనరిక వివాహాలు నిషిద్ధం. దక్షిణాదికి ఆ వివాహాలకు ఆమోదం లభిస్తోంది. ఇలా చాలా చిక్కుముడులు, వైరుధ్యాలతో కూడిన అంశాలను పరిగణలోకి తీసుకోకుండా దుందుడుకు చర్యలకు దిగితే భారతదేశ సమాజం సామాజిక సంక్షోభాలకు నిలయంగా మారుతుంది. మహిళా సాధికారత నిజమైన ఆశయం అయితే సమానత్వం కోసం ఆచరణాత్మకంగా అనేక చట్టాలు చేయవచ్చు.

సెల్: 9059837847

మణిపూర్‌లో హింస, మహిళల నగ్న ప్రదర్శనపై

చర్చించాల్సిందే

- లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్షాల డిమాండ్
- దద్దరిల్లిన పార్లమెంటు
- హోరెత్తిన నినాదాలు
- ఉభయ సభలు వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో పార్లమెంటు దద్దరిల్లింది. ఈశాన్య రాష్ట్రంలో హింసాత్మక ఘటనలతో పాటు తాజాగా మహిళల నగ్న ఊరేగింపుపై విపక్షాలు ఉభయ సభలను కుదిపివేశాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ శుక్రవారానికి వాయిదా పడ్డాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు గురువారం ప్రారంభం కాగా ఇటీవల మృతిచెందిన సభ్యులకు సంతాపం ప్రకటించాయి. మణిపూర్ అంశంపై చర్చ కోసం ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. లిస్టెడ్ పత్రాల సమర్పణ, సినిమాటోగ్రాఫ్ (సవరణ) చట్టం ప్రవేశం అనంతరం రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అటు లోక్‌సభలోనూ ఇదే తరహా పరిస్థితితో వాయిదా అనివార్యమైంది. తిరిగి 2 గంటలకు సమావేశం కాగా 'మణిపూర్', 'మణిపూర్ తగలబడిపోతోంది' నినాదాలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో హోరెత్తిన లోక్‌సభను చైర్మన్ కిరిట్ సొలంకి శుక్రవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలో ప్రతిపక్షాల నిరసన నడుమ సినిమాటోగ్రాఫ్ సవరణ చట్టాన్ని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మణిపూర్‌పై చర్చ కోసం ఉదయం నుంచి డిమాండ్ చేస్తున్నాం. ముందస్తు నోటీసులు ఇచ్చినా అనుమతి ఇవ్వలేదు. 'నిబంధన 267 కింద చర్చను కోరితే పట్టించుకోవడం లేదు. అటు మణిపూర్ తగలబడిపోతోంది. ఆ రాష్ట్రంలో మహిళలపై దురాగతాలు పెరిగిపోయాయి. వారిని నగ్నంగా ఊరేగిస్తున్నారు. అత్యాచారానికి గురిచేస్తున్నారు. మౌనం వహిస్తున్న మోదీ

సభలో మాట్లాడకుండా బయటకు వెళ్లి మాట్లాడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సభ మర్యాదను కాపాడాలని, కార్యకలాపాలను జరగనివ్వాలని ప్రతిపక్ష సభ్యులకు చైర్మన్ జగదీప్ ధన్కర్ సూచించారు. కానీ మణిపూర్ నినాదాలతో సభ్యులు సభను హోరెత్తించడంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్కర్ వెల్లడించారు. అంతకుముందు టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ కూడా మణిపూర్ పరిస్థితిపై చర్చకు డిమాండ్ చేశారు. దీనిపై ప్రధాని మౌనం వీడాలన్నారు. 267 నిబంధనను అమలు చేయాలని, నోటీసులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనేక ప్రతిపక్ష పార్టీల సభ్యులు కూడా నిబంధన 267 కింద నోటీసులిచ్చి మణిపూర్‌లో హింసపై చర్చకు డిమాండ్ చేశారు. పార్లమెంటు బయట కూడా కాంగ్రెస్, ఆప్, ఎస్పీతో సహా ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశాయి. మణిపూర్‌లో హింస, మే4న ఇద్దరు మహిళల నగ్న ఊరేగింపు అంశాలపై దుయ్యబట్టారు.

చర్చకు ప్రభుత్వం సిద్ధమేగానీ: గోయల్, జోషి

మణిపూర్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని, ప్రతిపక్షాలే పారిపోతున్నాయని, అది జరగాలని అవి కోరుకోవడం లేదు, అందుకే సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయని కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. మణిపూర్‌లో తాజా ఘటనను ప్రస్తావిస్తే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో మహిళలను అవమానించిన, వారితో అనుచిత ప్రవర్తన ప్రస్తావనకు వస్తుందని భయపడ్డారని వ్యాఖ్యానించారు. పార్లమెంటు సమావేశాలను కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలన్నీ అడ్డుకున్నాయి. చర్చ కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాగానీ ప్రతిపక్షాల తీరును బట్టి సభలను సజావుగా జరగనివ్వాలని వారికి లేదని స్పష్టమైందని గోయల్ అన్నారు. 'పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ అధికారంలో ఉంది. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళలతో అనుచిత ప్రవర్తన ఘటనలు ప్రస్తావనకు వస్తాయని భయపడ్డాయి అందుకే మొఖం చాటేశాయి. రాజ్యసభలో మణిపూర్‌పై స్వల్పకాలిక చర్చ కోసం చైర్మన్ అనుమతిస్తే ఖర్గే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అన్ని కార్యకలాపాలను రద్దు చేసి కేవలం తమ నోటీసులను పరిగణనలోకి తీసుకోవాలని, 267 నిబంధన కింద మణిపూర్ అంశాన్ని మాత్రమే చర్చించాలని డిమాండ్ చేశారు' అని గోయల్ వ్యాఖ్యానించారు. ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ '176 నిబంధన కింద స్వల్పకాలిక చర్చ కోసం అనేక మంది ప్రతిపక్ష సభ్యులు నోటీసులు ఇచ్చారు. మేము అంగీకరిస్తామని వారు అనుకోలేదు. మేం అంగీకరించడంతో కార్యకలాపాలను స్తంభింపజేసేందుకు సాకులు వెతికారు. ఇది వారి వైఖరి' అని విమర్శించారు. బిజినెస్ సలహా కమిటీ సమావేశాన్ని కూడా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అడ్డుకున్నాయన్నారు. మణిపూర్ చాలా సున్నితమైన అంశమని, దీనిపై ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని, చర్చలు జరిగినప్పుడు హోంమంత్రి అమిత్ షా వివరణ ఇస్తారని చెప్పారు. గతంలో జరిగిన చర్చలను, ఎప్పుడు ఎవరు ఏమేమి అన్నారో సభ ముందర ఉంచుతారని గోయల్ అన్నారు.

మహిళల నగ్న ఊరేగింపు భయానకం

మణిపూర్ వెళ్లే సమయం లేదా మోదీజీ: ఆప్ మంత్రి అతిషి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో భయం కలిగించిందని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిషి చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీకి విదేశీ పర్యటనలు చేయడానికి సమయం ఉంది కానీ...అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ వెళ్లడానికి కుదరడం లేదని విమర్శించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో బహిర్గతం కావడంతో మణిపూర్ పర్వత ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాష్ట్రంలో మెయితీ, కుకీ జాతుల మధ్య మే 3న ఘర్షణ ప్రారంభమైంది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. మంత్రి అతిషి గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీ మే 19న జపాన్, 21న పపువా గునియా, 22న ఆస్ట్రేలియా, జూన్ 20న అమెరికా, అక్కడి నుంచి ఫ్రాన్స్, యూఏఈలో పర్యటించారని, కానీ మణిపూర్ వెళ్లడానికి ప్రధానికి సమయం దొరకలేదని విమర్శించారు. మణిపూర్ నుంచి వచ్చిన ప్రతినిధి బృందంతో మాట్లాడటానికి కూడా ప్రధాని అనుమతించలేదని మండిపడ్డారు. 'ఈ వీడియో భయోత్పాతం సృష్టించడమే కాకుండా గుండెలు పగిలేలా చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని ప్రపంచమంతా చూసింది. పశువుల పట్ల కూడా ఇంత అమానుషంగా ఎవరూ ప్రవర్తించరు. అయినా మణిపూర్ హింస, ఇలాంటి ఘటనలపై బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదు' అని అతిషి ఆరోపించారు. తమపై అత్యాచారానికి పాల్పడి...తర్వాత నగ్నంగా ఊరేగించారని, అయినా అక్కడే ఉన్న పోలీసులు చర్యలు తీసుకోలేదని బాధితురాలు స్థానిక మీడియాకు చెప్పిందని ఆమె తెలిపారు. 'ఈ మహిళకు బీజేపీ ఏమి సమాధానం చెబుతుంది. ఈ మహిళలకు, దేశంలోని మహిళామణులకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఏమి చెబుతారని నేను ప్రశ్నిస్తున్నాను, మణిపూర్ ప్రజలు సుదీర్ఘకాలంగా హింసను ఎదుర్కొంటున్నారు' అని అతిషి చెప్పారు. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్న నాయకులు, కార్యకర్తలతో బీజేపీ నిండిపోయిందని చెబుతూ కుల్దీప్ సింగ్ సెంగార్, బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వంటి కొన్ని పేర్లను ప్రస్తావించారు.

నిందితులపై తక్షణ చర్యలు తీసుకోండి

మోదీకి స్వాతి మాలివాల్ లేఖ

న్యూఢిల్లీ: మణిపూర్ హింస కట్టడికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మోదీకి ఆమె గురువారం లేఖ రాశారు. అత్యాచారానికి పాల్పడటమే కాకుండా ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులు, వారి కుటుంబాలను, భయంతో కాలం గడుపుతున్న ఇతర మహిళలు, బాలికలను ఓదార్చడానికి మణిపూర్ వెళ్లనున్నట్లు మాలివాల్ తెలిపారు. మే 4న జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, భయోత్పాతం కలిగించిందని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ బాధితులకు న్యాయం చేయకపోవడం హృదయాన్ని కలచివేసిందని తెలిపారు. ఇంతటి అమానుష ఘటన జరిగి రెండున్నర నెలలు అయినప్పటికీ నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళల పట్ల జరిగిన ఈ దాష్టీకానికి బాధ్యులపై సత్వరమే చర్యలు తీసుకునేలా స్థానిక అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు అవసరమైన మద్దతు, రక్షణ కల్పించాలని కోరారు. నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపైనా కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మలివాల్ లేఖలో పేర్కొన్నారు. ఘటన జరిగి రెండున్నర మాసాలైనా నిందితులను అరెస్టు చేయకపోవడం క్షమించరాని నేరమని వ్యాఖ్యానించారు. తక్షణమే మణిపూర్‌లో పర్యటించి...పరిస్థితిని అంచనా వేయాలని, మణిపురి మహిళకు భరోసా కల్పించాల్సిన సమయం ఇదేనని మోదీకి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మహిళా, శిశుశాఖమంత్రి, జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మణిపూర్ వెళ్లి బాధితులను పరామర్శించకపోవడం బాధాకరమన్నారు.

మణిపూర్ ఘటన అమానవీయం

మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా

షిల్లాంగ్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో బయటకు వచ్చిన ఘటనపై మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా గురువారం స్పందించారు. ఈ సంఘటనను కించబరిచేదిగా ఆయన అభివర్ణించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ ట్వీట్ చేశారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఘటనపై తాను కలత చెందానని, ఏ వ్యక్తికైన వారి గౌరవానికి ఇబ్బంది కలిగించే విధంగా తోటి వ్యక్తులు ప్రవర్తించడం అత్యంత అవమానకరమైన అమానవీయమైన చర్య అని సంగ్మా అన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. దోషులకు కఠినంగా శిక్ష పడాలని కోరుకుంటున్నానని సంగ్మా ట్వీట్ చేశారు. మణిపూర్‌లోని కొండ ప్రాంతంలో మే 4న ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్న వీడియో వైరల్ అవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు బాధ్యుడైన ప్రధాన సూత్రధారిని గురువారం అరెస్టు చేశారు.

మణిపూర్‌లో భారీ నిరసన ర్యాలీ

ఇంఫాల్: ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానుష ఘటనను నిరసిస్తూ రాష్ట్ర ప్రజలు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్థానికులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మణిపూర్‌లోని చురచంద్‌పూర్ జిల్లాలో వేలాది మంది ప్రజలు నల్లదుస్తులు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాధిత మహిళలకు న్యాయం జరగాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మీరు చర్యలు తీసుకుంటారా...మేము తీసుకోమా?

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. ఈ ఘటన ఆందోళనకు గురిచేసిందనీ, ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై కేంద్రం తగిన రీతిలో స్పందించకుంటే న్యాయస్థానమే చర్యలు చేపడుతుందన్నారు. ఈ ఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. మహిళలపై హింస దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. సామాజిక మాధ్యమాల్లో బహిర్గతమైన ఈ వీడియోతో ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారని పేర్కొంది.

ఆ అమానుష వీడియో తొలగించండి

- ట్విట్టర్‌కు ఎన్‌సీడబ్ల్యూ ఆదేశాలు
- ప్రధాన నిందితుడు అరెస్టు
- దోషులను ఉపేక్షించేది లేదు: సీఎం బీరేన్ సింగ్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానవీయ, హేయమైన ఘటనకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో నుంచి తక్షణమే తొలగించాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆదేశాలిచ్చింది. మే 4న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తత నెలకొంది. వీడియోల్లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, వేధించడం, వారికి రెండు వైపుల అనేక మంది మగవారుండటం కనిపిస్తుంది. దీనిపై ఎన్‌సీడబ్ల్యూ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేసింది. అమానవీయ ఘటనకు సంబంధించిన వీడియోలను తొలగించాలని ట్విట్టర్ ఇండియా పబ్లిక్ పాలసీ హెడ్‌కు ఆదేశాలిచ్చింది. బాధితులను గుర్తించే విధంగా వీడియోలు పెట్టడం శిక్షార్హమైన నేరమని పేర్కొంది. ఈ ఘటన కంగ్‌పోక్పి జిల్లాలో మే 4న జరిగిందని, నిస్సహాయ మహిళలను కొందరు మగవారు నిరంతరం వేధిస్తుంటే వదిలేయాలని బాధితులు బతిమాలుకుంటున్న దృశ్యాలు కలిచివేసినట్లు ఐటీఎల్ఎఫ్ (గిరిజన సంఘం) అధికార ప్రతినిధి పేర్కొన్నారు. గుర్తుతెలియని సాయుధులపై అపహరణ, సామూహిక అత్యాచారం, హత్య ఆరోపణల కింద కేసు థౌబల్ జిల్లాలోని నాగ్‌పోక్ సెక్మై పోలీసు స్టేషన్‌లో నమోదైంది. కాగా, ప్రధాన నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు మణిపూర్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. దోషులను ఉపేక్షించేది లేదని, మరణశిక్ష విధించే అంశాన్ని పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో బుధవారం వైరల్ అయిన క్రమంలో అనేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి నిందితులను గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 26 సెకన్ల నిడివిగల క్లిప్‌లో నిందితులను గుర్తించారు. ఇద్దరు మహిళలను ఇంతలా అవమానించడం బాధించిందని ట్విట్టర్‌లో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు. సమాజంలో ఇంతటి హేయమైన చర్యలకు స్థానం లేదని, దోషులను ఉపేక్షించేది లేదని, ఉరితీసేందుకూ వెనుకాడబోమని సీఎం ట్వీట్ చేశారు.

బీరెన్ సింగ్ రాజీనామా చేయాలి

మణిపూర్ ఘటనపై భగ్గుమన్న యువజన, మహిళా కాంగ్రెస్ విభాగాలు

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ పరిస్థితులపై బాధ్యత వహిస్తు ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ యువజన, మహిళ విభాగాలు డిమాండు చేశాయి. మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించినట్లు విడుదలైన వీడియోపై కాంగ్రెస్ విభాగాలు.. కేంద్ర, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలపై తీవ్రమైన విమర్శలతో దాడి చేశాయి. భారత యువజన కాంగ్రెస్ కార్యకర్తలు రైసినా రోడ్డు వద్ద, మహిళా కాంగ్రెస్ జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్‌లో హింసను అరికట్టండి.. శాంతిని నెలకొల్పండి అనే సందేశాలతో కూడిన బ్యానర్‌లను పట్టుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హిమాచల్‌ను వీడని వర్షాలు

- 26 రోజుల్లో 130మంది మృతి
- కూలిన వేలాది ఇళ్లు... తీవ్రంగా ఆస్తి నష్టం

సిమ్లా/రాంపూర్: ఈ సారి నైరుతి రుతుపవన వర్షాల కారణంగా అత్యంత దారుణంగా నష్టపోయిన రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. దాదాపు గత 26 రోజులుగా ఇక్కడ వర్షాలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడడం.. తదితర కారణాల వల్ల రాష్ట్రంలో గత 26 రోజుల్లో 130 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

ఈ సంవత్సరం హిమాచల్ ప్రదేశ్ లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని నదులు ఉప్పొంగి ప్రవహించాయి. నదీ పరివాహక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడి ప్రాణాలు తీశాయి. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడడం.. తదితర కారణాల వల్ల హిమాచల్ ప్రదేశ్ లో గత 26 రోజుల్లో 130 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ తెలియడం లేదు. 153 మంది గాయాల పాలయ్యారు. బుధవారం ఒక్కరోజే ఐదుగురు చనిపోయారు. వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటివాటి వల్ల రాష్ట్రంలో 572 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 4703 ఇళ్లు, 148 దుకాణాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 1286 గోశాలలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. భారీగా పంటనష్టం వాటిల్లింది. అయితే, హిమాచల్ ప్రదేశ్‌కు వర్షం ముప్పు ఇంకా ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. వర్ష సంబంధ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని, సహాయ బృందాలను అవసరమైన ప్రాంతాలకు పంపించామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి ఘటనల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్రం నుంచి రెండు బృందాలు రాష్ట్రానికి వచ్చాయి. వారు మండి, సోలన్ జిల్లాల్లో నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉన్నారు. రాష్ట్ర అధికారుల అంచనా ప్రకారం హిమాచల్ ప్రదేశ్ లో ఈ వర్షాల కారణంగా రూ. 4808.79 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం వర్షాకాలంలో రాష్ట్రంలో 61 కొండచరియలు విరిగి పడిన ఘటనలు, 44 ఆకస్మిక వరదలు ముంచెత్తిన ఘటనలు చోటు చేసుకున్నాయని వెల్లడించారు. క్రము పంచాయితీలో గురువారం వరదల కారణంగా ఇళ్లు, వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి, రాంపూర్-ఝక్రి మధ్య వరద ప్రవాహం కారణంగా సిమ్లా-కిన్నౌర్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు.

కొండచరియలు విరిగిపడి 13మంది మృతి

మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో ఘటన

రాయగఢ్: మహారాష్ట్ర రాయగఢ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 13 మంది మృతిచెందారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో.. దాదాపు 21 మంది గాయపడ్డారు. శిథిలాల కింద సుమారు దాదాపు 17 కుటుంబాలకు చెందిన 100 మంది చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన ఖలాపూర్ మండలంలోని ఇర్షాల్వాడి అనే గిరిజన కుగ్రామంలో జరిగింది. అధికారులు 75 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొండచరియలు విరిగిపడటంతో పెద్ద ఎత్తున మట్టి, రాళ్లు కొండపై నుంచి పడి దాదాపు 30 ఇళ్లు ధ్వసమయ్యాయి. కొం డచరియలు విరిగిపడ్డ ఘటనపై సమాచారం అందుకున్న సహాయ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని నవీ ముంబయిలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు మంత్రి ఉదయ్ సమంత్ తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనాలని ట్రెక్కర్ల బృందాలను జిల్లా యంత్రాంగం కోరింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గురువారం ఉదయం ఘటనాస్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సహాయక చర్యలను వేగవంతం చేయడంతో పాటు శిథిలాల కింద చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడంపై చర్చించేందుకు అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు ఉచిత వైద్యం అందిస్తామని, సహాయక చర్యల కోసం రెండు హెలికాప్టర్లను రంగంలోకి దించామని ఆయన తెలిపారు.

షిండేకు అమిత్‌షా ఫోన్

ప్రమాద ఘటనపై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా... షిండేతో ఫోన్లో మాట్లాడారు. నాలుగు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని స్థానిక యంత్రాంగంతో కలిసి సహాయక చర్యలు చేపడుతున్నాయని ఆయన ట్వీట్ చేశారు. శిథిలాల్లో చిక్కుకున్నవారిని రక్షించడం, క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించడమే తమ పని అని ఆయన తెలిపారు. కాగా రాయగఢ్ జిల్లాలో కొం డచరియలు విరిగిపడ్డ ప్రాంతంలో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా నవీ ముంబై నగరపాలక సంస్థకు చెందిన అగ్నిమాపక అధికారి శివరామ్ గుండెపోటుతో మృతి చెందారు.

రాయగఢ్ జిల్లాలో భారీ వర్షాలు

భారీ వర్షాల కారణంగా రాయ్‌గఢ్‌లోని అనేక ప్రాంతాలు వరద ముంపు వంటి పరిస్థితులు నెలకొ న్నాయి. దీంతో 746 కుటుంబాలకు చెందిన 2,200 మందికి పైగా ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాలకు జిల్లాలో కనీసం 125 ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రాయగఢ్‌లోని 28 డ్యామ్‌లలో 17 పొంగిపొర్లుతున్నాయని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలో అనేక చోట్ల గురువారం ఉదయంతో ముగిసిన 24 గంటల్లో 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందనట్లు పేర్కొంది.

ముంబైని ముంచెత్తుతున్న వర్షాలు

ముంబై నగరాన్ని వానలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా అనేక రైళ్లను నిలిపేశారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ముంబైలో 100 ఎంఎం వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు ముంబైలో, ముంబై శివారు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా ప్రాంతాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అలాగే, థానె, ఫాల్ఘార్, రాయిగఢ్, రత్నగిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వర్షాల వల్ల ముంబైలో నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు నరకం చూపిస్తున్నాయి. ముంబై, సబర్బన్ ముంబైలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని ప్రభుత్వం సూచించింది. ముంబైలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించింది. భారీ వర్షాల కారణంగా కొన్ని మార్గాల్లో లోకల్ రైలు సర్వీసులకు ఆటంకం ఏర్పడింది.

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: మణిపూర్‌లో మహిళల్ని అత్యంత పాశవికంగా నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేయడం భారతీయ సమాజ సమాజం సిగ్గుతో తల దించుకునేలా చేసిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత, బేటీ బచావో వంటివి నినాదాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. మణిపూర్ ఘటన జరిగి దాదాపుగా 80 రోజులు కాబోతోందని ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉన్న దేశంలో ఇలాంటి దారుణం జరగడం బాధాకరం అన్నారు. దేశంలో ఫ్యాసిస్టు మతోన్మాద పరిపాలన సాగుతోందని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఘటనను సుమోటో గా తీసుకుని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి న్యాయ విచారణకు ఆదేశించడంపై దుర్గాభవాని హర్షం వ్యక్తం చేశారు. నిందితుల్ని బెయిల్ ఇవ్వకుండా కఠినంగా శిక్షించాలని దుర్గాభవానీ డిమాండ్ చేశారు.

మణిపూర్ ఘటన దేశానికి సిగ్గుచేటు

ఎవరినీ ఉపేక్షించం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన దేశానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఇంతటి దురాగతానికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. మహిళల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. 'మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అమానవీయ ప్రవర్తన నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటన 140 కోట్ల మంది భారతీయులను సిగ్గుపడేలా చేసింది. ఆ మణిపూర్ కుమార్తెలకు జరిగిన అన్యాయాన్ని ఎన్నటికీ క్షమించలేం. మహిళల భద్రత విషయంలో రాజీపడబోం. నిందితులను విడిచిపెట్టబోమని ప్రజలకు భరోసా ఇస్తున్నా. ఈ ఘటనపై రాజకీయాలకు అతీతంగా స్పందించాలి. నిందితులను శిక్షించేందుకు చట్టం పూర్తి శక్తితో పనిచేస్తుంది' అని మోదీ తెలిపారు. 'ఏ దేశానికైనా ఇలాంటి ఘటన సిగ్గుచేటు. ఇది దేశానికి అవమానం' అని మోదీ అన్నారు. శాంతిభద్రతలు మరింత పటిష్టవంతం చేయాలని, ప్రత్యేకించి మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రులను ఆయన కోరారు. మణిపూర్‌లో పోరుబాట పట్టిన వర్గానికి చెందిన ఇద్దరు మహిళలపై కొందరు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించి, వారిని నగ్నంగా ఊరేగించిన ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. మే 4న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పార్లమెంటు సమావేశాల గురించి మాట్లాడుతూ సభ సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించాలని మోదీ కోరారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులంతా సహకరించాలన్నారు. అన్ని అంశాలపై పార్లమెంటులో చర్చలు జరగాలని కోరుకుంటు న్నామని, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు తగిన సమయం దొరుకుతుందన్నారు. ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ సమావేశాల్లో ప్రజలకు ఉపయోగపడే అనేక బిల్లులు తీసుకొస్తున్నామని, ముఖ్యమైన బిల్లులపై చర్చించేందుకు ఈ సమయాన్ని వినియోగించుకోవాలని మోదీ విపక్షాలకు పిలుపునిచ్చారు.

గిరిజన యువకుడిపై దాడి అమానుషం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రకాశం జిల్లా ఒంగోలులో గిరిజన యువకుడు నవీన్‌ను తీవ్రంగా కొట్టి, మూత్రం తాగించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన సభ్యసమాజం సిగ్గుపడేలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అమానుష ఘటనకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. గిరిజన యువకుడు నవీన్‌ను 9మంది నిందితులు చావబాది, మూత్రం తాగించి అత్యంత అమానుషంగా ప్రవర్తిం చడం దుర్మార్గం, అమానుషమని వ్యాఖ్యానించారు. బాధితుడు నవీన్ స్వయంగా ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించకపోవటం దారుణమని విమర్శించారు. నవీన్ చికిత్స కోసం ఆస్పత్రిలో చేరినప్పటికీ ఎంఎల్‌సీ (మెడికల్ లీగల్ కేసు) నమోదు చేయలేదని, చివరకు సోషల్‌మీడియాలో వీడియో వైరల్ కావడంతో పోలీసులలో కదలిక రావడం విచాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాలకు, మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు యంత్రాంగం కేవలం అధికారపార్టీ కనుసన్నల్లో మెలుగుతూ ముఖ్యమంత్రి, మంత్రులకు రక్షణ కల్పించడంలోనే నిమగ్నమైందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో నవీన్ వంటి బాధితులకు సరైన న్యాయం దొరకడం లేదన్నారు. ప్రజల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ దృష్టిపెట్టాలని, నవీన్ పట్ల అమానుషంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

సమర్థులకే పదవులు

- ఎన్నికలే లక్ష్యంగా టీడీపీ కార్యాచరణ
- ప్రతి ఒక్కరి పనితీరుపై రెండేసి సర్వేలు
- కొత్త ప్రక్రియకు పార్టీ అధినేత చంద్రబాబు శ్రీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజలతోపాటు కార్యకర్తలు, నేతల భవిష్యత్తుకు గ్యారంటీ ఉండేలా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సరికొత్త కార్యాచరణ ప్రక టించారు. ప్రతి ఒక్కరి పనితీరుపై రెండేసి సర్వేలు నిర్వహిస్తూ నివేదిక ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ ముఖ్య నేతలతో ఆయన నివాసంలో దాదాపు 3గంటలపాటు సమావేశమై వచ్చే ఎన్నికలకు సన్నద్ధతపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఓటు రూపంలో అనుకూలంగా మార్చుకునే విధానాన్ని చంద్రబాబు నేతలకు వివరించారు. బూత్ స్థాయి నుంచి ఇన్‌చార్జ్ వరకూ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకునేలా రూపొందించిన ప్రణాళికను నేతల ముందు ఆవిష్కరించారు. బూత్ స్థాయి నుంచి ఇన్‌చార్జ్ వరకు ప్రతి ఒక్కరి పనితీరుపై రెండేసి సర్వేలు నిర్వహిస్తూ ప్రతి నెలా నివేదిక ఇచ్చే ప్రక్రియకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ప్రతీ నియోజకవర్గంలో గత మూడు ఎన్నికల ఫలితాలు విశ్లేషించి తాజా పరిస్థితులకు తగ్గట్టుగా నేతలకు కమిటీలు యాక్షన్ ప్లాన్ ఇవ్వనున్నాయి. ఇందుకోసం ప్రతీ నియోజకవర్గానికి బ్యాక్ ఆఫీస్ బృందంగా దాదాపు 10మంది సభ్యులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. బూత్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్ ఇన్‌చార్జ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పనితీరును కమిటీ సభ్యులు మదింపు చేయ నున్నారు. ఏ స్థాయిలో పొరపాటు ఉంటే ఆ స్థాయిలోనే సరిదిద్దుకునేలా కమిటీలు ప్రతినెలా నివేదికలు ఇవ్వనున్నాయి. నాలుగు స్థాయిల్లో ప్రతి ఒక్కరి పనితీరును పరిశీలించి వారికి పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించినట్లు చంద్రబాబు స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది

రాష్ట్రం ఇప్పటికే చాలా నష్టపోయింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందుకే సూపర్ సిక్స్ అని మేనిఫెస్టోను ప్రకటించానని చంద్రబాబు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు నేతృత్వంలో అధికారపార్టీ నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా వారిని చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. ఇప్పుడు ఈ రాజకీయ దొంగ జగన్ దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఓటమి భయంతో తమకు పడవు అనుకున్న ఓట్లను తొలగిస్తున్నాడు. ప్రతి ఓటును కాపాడుకోవాలి. రేపటి నుంచి జరిగే ఓటర్ వెరిఫికేషన్ లో ప్రజలు భాగస్వాములు కావాలని, రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీని ఒక్క సీటు కూడా గెలవకుండా చిత్తు చిత్తుగా ఓడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, చినరాజప్ప,పితాని సత్యనారాయణ, మాజీ ఎంపీ మాగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాధితుడికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌ను కోరిన నీలం నాగేంద్ర
- ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసుల పట్ల పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- ఎస్టీ కమిషన్ సభ్యునికి ప్రోటోకాల్ పాటించని రెవెన్యూశాఖపై ఆగ్రహం

విశాలాంధ్ర-ఒంగోలు: హత్యాయత్నం, మూత్రం పోసిన ఘటనలో బాధితుడైన గిరిజన యువకుడు మోటా నవీన్‌కు ప్రభుత్వం నుంచి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌ను కోరారు. గిరిజన కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ గురువారం ఒంగోలు వచ్చారు. బాధితులను పరామర్శించిన అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకొని స్థానిక దళిత, గిరిజన నాయకులతో మాట్లాడారు. శంకర్ నాయక్‌ను నీలం నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్‌తో మాట్లాడుతూ, ఒంగోలు మూత్రం కేసు, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. జూన్ 19 రాత్రి ఘటన జరగగా, అదే రోజు నవీన్ సోదరుడు రాజు రిమ్స్ లో చేరి అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారన్నారు. అయితే పోలీసులు దీన్ని సాధారణ కేసుగానే చూశారన్నారు. బాధితులు జూన్ 26 జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారని, జిల్లా కలెక్టర్ డీఎస్పీ తో మాట్లాడినా పోలీసులు స్పందించలేదన్నారు. నిందితుల్ని ఎస్ఐ మల్లికార్జున రావు కనీసం స్టేషన్‌కి కూడా పిలిపించలేదన్నారు. దీంతో నిందితులు మితిమీరిన అహంకారంతో, మూత్రం పోసిన ఘటన రికార్డు చేసిన వీడియోను వైరల్ చేశారన్నారు. అందుకు ఈ కేసును ఎస్సీ ఎస్టీ యాక్ట్ కింద నమోదు చేయడం పోలీసులకు తప్పనిసరి అయిందన్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసులు విచారణకు ఇద్దరు డిఎస్పీలు అవసరం కాగా, ఎస్సీ ఎస్టీ సెల్లుకు ఒక్క డీఎస్పీ కూడా లేరన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్లుకు డీఎస్పీలుగా అగ్ర కుల అధికారులను నియమిస్తున్నారన్నారు. మధ్యప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగితే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధిత గిరిజనుడి కాళ్లు కడిగి క్షమాపణ చెప్పారని, ఆంధ్రాలో జరిగిన ఈ దారుణంపై కనీసం బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని నాగేంద్ర కోరారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర నాయక్ అధికారిక పర్యటనగా ఒంగోలు వచ్చినప్పటికీ, రెవెన్యూ శాఖ నుంచి ఒక్కరు కూడా కమిషన్ వద్దకు రాలేదన్నారు. గతంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ వచ్చినప్పుడు కూడా జిల్లా కలెక్టర్ చైర్మన్‌ను కలిసేందుకు రాలేదని, ఇప్పుడు ఎస్టీ కమిషన్ సభ్యుడు వచ్చినప్పుడు కూడా కనీసం తాసిల్దార్ స్థాయిలో కూడా ప్రోటోకాల్ పాటించలేదని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొరియా ఓపెన్ సెమీస్‌కు సాత్విక్-చిరాక్ జోడీ

న్యూఢిల్లీ: కొరియా ఓపెన్ సూపర్ 500 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టీ ద్వయం క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. మరోవైపు.. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాంబ్సు రజావత్ పోరాటం ముగిసింది. వీళ్లిద్దరూ రెండో రౌండ్‌లోనే అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. సాత్విక్- చిరాగ్ చైనాకు చెందిన హి జిటింగ్, జో హెూడాంగ్ జోడీని చిత్తు చేశారు. 43 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో 21-17, 21-15తో గెలుపొందారు. వీళ్లు సెమీస్ లో జపాన్‌కు చెందిన ఐదోసీడ్ తరుకో హోకి, యుగో కొబయషితో తలపడనున్నారు.

ఆకట్టుకున్న రజావత్

కొరియా ఓపెన్‌లో ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన ప్రణయ్‌ను హాంకాంగ్ ప్లేయర్ లీ చెక్ యూ కాంగ్ చిత్తు చేశాడు. తనకంటే 8 ర్యాంకులు తక్కువ ఉన్న లీ చెక్ చేతిలో 15-21 21-19 18-21తో ఓడిపోయాడు. రెండో సీడ్ కొడాయి నరోకతో హెూరాహెూరీగా తలపడిన ప్రియాంబ్సు రజావత్ ఆకట్టుకున్నాడు. స్వల్ప తేడాతో 14-21 21-18 17-21 పరాజయం మూటగట్టుకున్నాడు. వీరిద్దరి నిష్క్రమణతో సింగిల్స్‌లో పతకం ఆశలు గల్లంతయ్యాయి.

రోహిత్, జైస్వాల్ అర్ధ సెంచరీలు

పోర్ట్‌ఆఫ్ స్పెయిన్: భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ట్రినిడాడ్ క్వీన్స్‌పార్క్ ఓవల్ వేదికగా గురువారం ప్రారంభమైన రెండో టెస్టు టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో భోజన విరామ సమయానికి వికెట్ నష్టపోకుండా 121 పరుగులు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ 63 (102 బంతుల్లో), జైస్వాల్ 52 (56 బంతుల్లో) పరుగులతో క్రీజులో ఉన్నారు. భారత్-విండీస్ జట్ల మధ్య వందోది అయిన ఈ టెస్టులో టాస్ గెలిచిన విండీస్ కెప్టెన్ క్రెగ్ బ్రాత్‌వైట్ బౌలింగ్ తీసుకున్నాడు. పిచ్ స్లోగా ఉంటుందనే ఉద్దేశంతో భారత జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఇది 500వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ స్టార్ ముకేశ్ కుమార్ టెస్టుల్లో ఆరంగేట్రం చేశాడు. విండీస్ తరఫున కిర్క్ మెకెంజీకి కూడా ఇదే మొదటి మ్యాచ్.

భారత జట్టు : యశస్వీ జైస్వాల్, రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, అజింక్యా రహానే, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అశ్విన్, జయదేవ్ ఉనాద్కాట్, ముకేశ్ కుమార్, సిరాజ్.

వెస్టిండీస్ జట్టు : క్రెగ్ బ్రాత్‌వైట్(కెప్టెన్), తంగనరైన్ చందర్‌పాల్, కిర్క్ మెకంజీ, జెర్మైన్ బ్లాక్‌వుడ్, అలిక్ అథనజే, జోషువా డ సిల్వా(వికెట్ కీపర్), జేసన్ హెూల్డర్, అల్జారీ జోసెఫ్, కీమర్ రోచ్, జొమెల్ వార్రికన్, షనాన్ గాబ్రియెల్.

నవంబర్ 1-8 వరకు విశాఖపట్నంలో ఐసీఐడీ సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ : వ్యవసాయరంగంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవటం అనే అంశంపై విశాఖపట్నంలో నవంబర్ 1 నుంచి 8 వరకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 25వ అంతర్జాతీయ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సును నిర్వహిస్తున్నట్లు జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఐసీఐడీ సదస్సు నిర్వహణపై గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి రాంబాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 80 దేశాలు నీటి ఎద్దడి, నీటి యాజమాన్యం, నీటి వినియోగం తదితర అంశాలపై ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఐసీఐడీ మేథోమధనం జరుగుతుందని, ఈ ఏడాది నవంబర్ లో మన దేశంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఈ సదస్సు నిర్వహించటం గర్వకారణమన్నారు. ఐసీఐడీ సదస్సును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. 57 సంవత్సరాల తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చొరవతో ఈ ఏడాది మన వైజాగ్ లో నిర్వహించటం గొప్ప విషయమన్నారు. ఈ సదస్సుకు ప్రధానమంత్రి, రాష్ట్రపతులను ప్రత్యేకంగా ఆహ్వానించామని తెలిపారు. ఈ క్రమంలో ఐసీఐడీ సదస్సును ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సదస్సుకు దాదాపు 80 దేశాల నుంచి 500 మందికి పైగా విదేశీ ప్రతినిధులు, మన దేశం నుంచి 700 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. సదస్సులో నీటి పారుదల, డ్రైనేజీపై ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. వ్యవసాయరంగంలో నీటి ఎద్దడిని ఎదుర్కోవటం అనే అంశంపై ప్రధానంగా నిపుణులు చర్చిస్తారని వివరించారు.

సమావేశంలో జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (ఇరిగేషన్) సి. నారాయణ రెడ్డి, ఐసీఐడీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. యల్లారెడ్డి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సిల్క్స్ యజమానిపై కఠిన చర్యలు

పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్

వ్యాపారుల బకాయిలు ఇప్పించాలని కోరుతూ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారులు గిరిరాజు శశి, కోటం ఆనంద్‌ల వద్ద చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారికి డబ్బు ఇవ్వకుండా చెల్లని చెక్కు ఇవ్వటమే కాకుండా తమ డబ్బులు ఇవ్వాలని కోరినందుకు వ్యాపారులపై దాడి చేసిన ఆలయ సిల్క్స్ యజమాని అవినాశ్ గుప్తా, అతని అనుచరులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చేనేత సంఘాల సమన్వయ కమిటీ కో కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని ఆలయ సిల్క్స్ షాపు ముందు ధర్మవరానికి చెందిన గిరిరాజు శశి, కోటం ఆనంద్, బాధితులు మరో 19 మంది గురువారం ధర్నా చేశారు. ధర్నాలో పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో శశి ఆనంద్‌లపై దాడి...వారిద్దరిపై జరిగిన దుశ్చర్యగా కాకుండా యావత్ చేనేత సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఎంతో సౌమ్యులు అయిన నేతన్నలు తాము నేసిన బట్టకు డబ్బులు అడిగినందుకు ఇంత అమానుషంగా చిత్రహింసలకు గురిచేసి...అవమానించి... వారి కుటుంబాలను మానసిక వేదనకు గురి చేశారని మండిపడ్డారు. నాటి దుశ్చర్యను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగానే ఆందోళనలు చేసిన ఫలితంగా అవినాశ్ గుప్తాను పోలీసులు అరెస్టు చేశారన్నారు. శశి, ఆనంద్‌లతో పాటు మిగతా వారికి కూడా రావాల్సిన డబ్బులు ఇప్పించ వలసిందిగా, అలాగే పరువు నష్టం కింద వారిద్దరికీ చెరో కోటి రూపాయలు ఇప్పించ వలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవినాశ్ గుప్తాపై రౌడీషీట్ ఓపెన్ చేసి భవిష్యత్తులో చేనేత వర్గాలపై ఇటువంటి అమానుష దాడులు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు చేనేత సమాజం ఒక్కటిగా ముందుకు నడవాలని సూచించారు. చేనేత ఐక్యకార్యాచారణ కమిటీ, చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు ధర్నాలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతును, సంఘీభావాన్ని తెలిపారు.

ధర్నాలో బాధితులైన గిరిరాజు శశి, కోటం ఆనంద్, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది వైకే, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంత ప్రసాద్, తెలుగునాడు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, తెలుగునాడు చేనేత కార్మిక సంఘం నాయకుడు కారంపూడి అంకమ్మరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కౌతరపు వెంకటేశ్వరరావు, ధర్మవరానికి చెందిన గిరిరాజు రవి, గిరిరాజు నగేశ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ పై పరువు నష్టం దావా

ఏపీ ప్రభుత్వం నిర్ణయం- అజయ్ జైన్ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వలంటీర్లపై నిరాధార మైన వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పై పరువు నష్టం దావా వేసేందుకు జగన్ సర్కార్ సిద్ధమైంది. ఏలూరులో ఈ నెల 9న పవన్ తన వారాహి యాత్ర సభలో మహిళల అక్రమ రవాణా చేస్తున్నారంటూ వలంటీర్లపై వ్యాఖ్యలు చేయడాన్ని ప్రభుత్వం తప్పుపట్టింది. ఉద్దేశ పూర్వకంగా తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు పవన్‌పై న్యాయస్థానంలో పరువు నష్టం కేసు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీజేశారు.పవన్ వ్యాఖ్యలతో వలంటీర్లు నిరసనలు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై పవన్ చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేలా ఉన్నాయని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులతో పవన్ పోల్చడంపై నిరసనలు వెల్లువెత్తాయి. దీనిపై 1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం పవన్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు నిర్ణయించింది. వలంటీర్ల పై నిరాధారమైన ఆరోపణ చేసినందుకు సంబంధిత న్యాయస్థానంలో పరువు నష్టం కేసు వేయాలని ప్రభుత్వ న్యాయవాదిని అజయ్ జైన్ ఆదేశించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.